# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
16-5-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 56

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## పెట్రో, డీజిల్ ధరల పెరుగుదల

లీటర్‌పై కనీసంగా రూ.3 పెంపు

ధరలు పెంచుతూ ఆయిల్ కంపెనీల నిర్ణయం 2లో

## 'వయసు' అసలు పాయింట్!

మైనర్ అని తేలితే బండి భగీరథ్ కు కష్టమే

మేజర్ అని తెలిస్తే కాస్త ఉపశమనం

లోతుగా దర్యాప్తు చేస్తున్న సిట్

క్రైమ్ మిర్రర్, హైదరాబాద్: ఇప్పుడు అందరి దృష్టి తెలంగాణలోని బండి సంజయ్ కుమారుడి కేసు పైనే. అసలు ఈ కేసులో ఎటువంటి సంచలనాలు నమోదు అవుతాయో? అనే ఆత్రుత అందరిలోనూ ఉంది. అయితే



3లో




## కరూర్ మృతుడి తల్లికి విజయ్ పాదాభివందనం!

తొక్కిసలాట ఘటనను చింతిస్తూ తీవ్ర మనస్థాపం

బీబీసీ కథనాల్లో ప్రచురితం

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన పనిని మొదలుపెట్టారు. అతి కష్టం మీద రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా

# బండి భగీరథ్‌కు నో బెయిల్



- మధ్యంతర బెయిల్ కు నిరాకరించిన హైకోర్టు
- ముందస్తు బెయిల్ పై ఈ నెల 21న తీర్పు
- అప్పటివరకు అరెస్టు చేయకుండా రక్షణ..
- కల్పించాలన్న అభ్యర్థన కూడా తిరస్కరణ
- అర్ధరాత్రి 12 గంటల తరువాత కోర్టు నిర్ణయం
- బాధితురాలు మైనరేనని తెలిపిన పీపీ
- రెండు బర్త్ సర్టిఫికెట్లలోతో ధ్రువీకరణ

పోక్సో కేసులో అరెస్టు కాకుండా తప్పించుకోవాలనుకున్న కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ అతడు దాఖలు చేసిన పిటిషన్ ను న్యాయస్థానం తోసిపుచ్చింది.

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్**

మైనర్ బాలికపై లైంగిక దాడికి సంబంధించిన పోక్సో కేసు అయినందున నిందితుడికి మధ్యంతర రక్షణ కల్పించలేమని పేర్కొంది. అయితే ముందస్తు బెయిల్ కోసం భగీరథ్ దాఖలు చేసిన పిటిషన్ పై తీర్పును ఈ నెల 21న వెలువరిస్తామని తెలిపింది. అప్పటివరకు తీర్పును రిజర్వు చేస్తున్నట్లు పేర్కొంది. కనీసం ఆ తీర్పు వెలువరించేదాకా అరెస్టు కాకుండా మధ్యంతర రక్షణ కల్పించాలని

- మిగతా 2వ పేజీలో

# కేటీఆర్ చుట్టూ ఉచ్చు!

ఫార్ములా ఈ రేసు కేసులో మరోసారి విచారణకు హాజరు కావాలంటూ నోటీసులు

చార్జ్ షీట్ దాఖలు చేసిన ఎసిబి



**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్**

కేటీఆర్ చుట్టూ ఉచ్చు బిగుస్తోందా? ఆయన అరెస్టు తప్పదా? అందుకే ఆయన దూకుడుగా వ్యవహరించలేకపోతున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. తాజాగా ఏసీబీ దాఖలు చేసిన చార్జ్ షీట్ ను స్వీకరించింది ఏసీబీ కోర్టు. జూలై 31న హాజరు కావాలంటూ కేటీఆర్ కు నోటీసులు జారీ చేసింది. దీంతో ఈ అనుమానాలకు మరింత బలం చేకూరింది.

- మిగతా 2వ పేజీలో

**భారీ అవినీతి జరిగిందంటూ..**

గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఫార్ములా ఈ రేసు కార్ల పేరిట భారీ ఎత్తున అవకతవకలు పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా అప్పటి మంత్రి కేటీఆర్ అవినీతికి పాల్పడ్డారన్న అభియోగాలు మోపింది ఏసీబీ. దీనిపై విచారణ చేపట్టిన ఎసిబి తాజాగా చార్జ్ షీటును కోర్టులో దాఖలు చేసింది.



## షర్మిల పాదయాత్ర!

రాయలసీమలోని ఉమ్మడి నాలుగు జిల్లాల్లో చేసేందుకు సన్నాహాలు

మిగతా ప్రాంతాల్లో మాత్రం బస్సుయాత్ర

కాంగ్రెస్ హై కమాండ్ గ్రీన్ సిగ్నల్

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల పాదయాత్రకు సిద్ధపడుతున్నారా? అయితే ఇది అన్ని ప్రాంతాల్లో కాదా? కేవలం రాయలసీమకి ఆమె పాదయాత్ర పరిమితం కానుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. రాయలసీమకు అతి దగ్గరగా ఉండే కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. తమిళనాడులో కాంగ్రెస్ సహకారంతో విజయ్ ప్రభుత్వం ఏర్పాటయింది. తెలంగాణలో రేవంత్ రూపంలో

- మిగతా 2వ పేజీలో



# ఇండియా కూటమి బలోపేతం!

కాంగ్రెస్ నేతృత్వంలో పనిచేసేందుకు బలమైన ప్రాంతీయ పార్టీలు సిద్ధం

బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ఓటమి అసలైన లక్ష్యం

ఏకతాటిపైకి ప్రాంతీయ పార్టీల నేతలు

**క్రైమ్ మిర్రర్, ఢిల్లీ:**

రాజకీయాల్లో అవసరాలు మాత్రమే పనిచేస్తాయి. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా వ్యవహరిస్తారు నేతలు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరిస్తారు. ఇప్పుడు జాతీయస్థాయిలో చాలా రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రిలకు ఇదే పరిస్థితి ఎదురైంది.

ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ నేతృత్వంలో ఎన్డీఏ కు వ్యతిరేకంగా నేతలంతా ఒకే పార్టీ పైకి రావాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. భారతీయ జనతా పార్టీ ప్రధమ ప్రత్యర్థి కాంగ్రెస్. అయితే అటు తరువాత చాలా ప్రాంతీయ పార్టీలను

- మిగతా 2వ పేజీలో





## రాయలసీమలో చారిత్రక ఘట్టం!

యుద్ధ విమాన తయారీ కేంద్రానికి భూమి పూజ

సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ హాజరు

# సీఎం రమేష్ వర్సెస్ పురందేశ్వరి!



కేంద్రమంత్రి పదవి కోసం గట్టి పోటీ

ఇద్దరికీ హై కమాండ్ వద్ద పరపతి

అధిష్టానం ఎటు మొగ్గు చూపుతుందో?

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** కేంద్ర మంత్రివర్గ విస్తరణ త్వరలో జరగనుంది. కేంద్రంలో మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ అధికారంలోకి వచ్చి రెండేళ్లు సమీపిస్తోంది. అందుకే క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ దిశగా మోడీ అడుగులు



- మిగతా 2వ పేజీలో

## నీట్ పరీక్ష కొత్త షెడ్యూల్ విడుదల

- జూన్ 21న ఎగ్జామ్ నిర్వహణకు తేదీ ఖరారు
- వివరాలు వెల్లడించిన ఎన్‌టిఎ
- వచ్చే ఏడాది నీట్ ఆన్‌లైన్ పరీక్ష
- లీకేజీని అరికట్టేందుకు చర్యలు
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ,మే15(ఆర్ఎన్ఎ): ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో రద్దయిన నీట్ యూజీ 2026 పరీక్షను మళ్లీ నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారైంది.







# నీట్ పరీక్ష కొత్త షెడ్యూల్ విడుదల

జూన్ 21న, ఆదివారం ఈ పరీక్ష జరగనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ మేరకు ఎన్‌టీఏ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. రీఎగ్జామ్‌కు సంబంధించి అధికారిక మార్గాల్లో వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని విద్యార్థులను ఎన్‌టీఏ కోరింది. హాల్‌టికెట్, ఇతరత్రా వివరాలను త్వరలోనే వెల్లడించనుంది. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3వ తేదీన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-యూజీని (నీట్-యూజీ) నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో ఈ పరీక్ష జరిగింది. అయితే, ఈ పరీక్ష ప్రశ్నపత్రాలు కొన్నిచోట్ల లీకయ్యాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నాటి పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 23 లక్షల మంది మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా.. రీఎగ్జామినేషన్‌కు మరోసారి దరఖాస్తు చేసుకోనక్కర్లేదని, ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ఇదిలాఉండగా.. నీట్ పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు కీలక నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. రాజస్థాన్‌లోని సికార్‌లో ఈ లీకేజీ వ్యవహారం బయటపడింది. సుమారు 410 ప్రశ్నలతో ఒక గెస్ పేపర్ పరీక్షకు ముందే విద్యార్థులకు అందగా.. అందులోని 120 కెమిస్ట్రీ ప్రశ్నలు పరీక్షలో వచ్చాయనే ఆరోపణలొచ్చాయి. ప్రశ్నల క్రమంతో పాటు ఆప్షన్లు కూడా ఒకే వరుసలో ఉండటంతో లీక్ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రశ్నపత్నం లీక్ అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అక్కడి నుంచి రాజస్థాన్, హరియాణా, జమ్మూకశ్మీర్, కేరళ సహా పలు రాష్ట్రాలకు చేరినట్లు దర్యాప్తులో తేలింది. ఈ పేపర్ కోసం విద్యార్థుల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం.నీట్ పేపర్ లీక్ వ్యవహారం సంచలనం సృష్టించింది. దాంతో మే 3న నిర్వహించిన పరీక్షను రద్దు చేసి, మళ్లీ జూన్ 21న ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మీడియాతో మాట్లాడారు. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని వెల్లడించారు. జూన్ 21న నీట్ రీఎగ్జామ్ తేదీ ఖరారైంది. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలపై విచారణకు ఆదేశించాం. ఇప్పటికే ఈ కేసును సీబీఐ విచారిస్తోంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. వారు నష్టపోకూడదనే పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తున్నాం అని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండేలా చూడటమే మా మొదటి లక్ష్యం. పరీక్ష పారదర్శకంగా నిర్వహించడమే మా ప్రధాన కర్తవ్యం. ఏటా కోటి మందికి ఎన్టీఏ పరీక్షలు నిర్వహిస్తోంది. పేపర్ ఎలా లీక్ అయింది.. ఎవరి నుంచి ఎక్కడికి వెళ్లిందన్న పూర్తి వివరాలు పూర్తి బహిర్గతమవుతాయి. ఈసారి ఎలాంటి పరిస్థితుల్లోనూ మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూసుకుంటాం. రీటెస్ట్ కోసం విద్యార్థులు నచ్చిన నగరాన్ని ఎంచుకోవడానికి వారం రోజులు గడువు ఇస్తున్నాం. జూన్ 14న అడ్మిట్ కార్డులు విడుదల చేస్తాం. నీట్ కోసం మళ్లీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోన్న వార్తలు చూసి విద్యార్థులు ఆందోళన చెందొద్దని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు.

# బండి భగీరథ్‌కు నో బెయిల్

(మొదటి పేజీ తరువాయి)

భగీరథ్ తరపు న్యాయవాది కోరినా.. అలా కుదరదని స్పష్టం చేసింది. భగీరథ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ పై శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు వాదనలు కొనసాగాయి. 12 గంటల తరువాత కోర్టు తమ నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా భగీరథ్ తరపు న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. బాధితురాలి తల్లిదండ్రులు పెద్ద పరపతి ఉన్న వ్యక్తులు అని, పైగా బండి సంజయ్ కి ప్రత్యర్థి పార్టీ అయిన పార్టీ.. రాష్ట్రంలో అధికారంలో ఉందని తెలిపారు. వీరు అధికార పార్టీతో కలిసి బండిసంజయ్ ను రాజకీయంగా దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వర్రావు వాదనలు వినిస్తూ బాధితురాలు మైనర్ కాదంటూ దుష్ప్రచారం జరుగుతోందని తెలిపారు. కానీ, ఆమెకు ప్రస్తుతం 17 ఏళ్ల 3 నెలలు మాత్రమేనని చెప్పారు.

# పెట్రో, డీజిల్ ధరల పెరుగుదల

(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీ: ఊహించినట్లుగానే.. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటరు పెట్రోల్‌పై సగటున రూ.3, డీజిల్‌పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంక్షోభం నేపథ్యంలో.. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. అయినప్పటికీ.. ప్రభుత్వరంగ చమురు కంపెనీలు దాదాపు 11 వారాల పాటు ఇంధన ధరలను స్థిరంగా ఉంచాయి. అయితే, అవి తీవ్ర ఆర్థికఒత్తిళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. లీటరుకు రూ.3 పెంచి వాహనదారులపై కొంత భారాన్ని మోపాయి. 2022 ఏప్రిల్ నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు మారలేదు. అయితే, లోక్‌సభ ఎన్నికలకు ముందు 2024 మార్చిలో లీటరుకు రూ.2 చొప్పున తగ్గించాయి. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన ధరలు పెరుగుతాయంటూ ఇటీవల పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే, సరిపడా నిల్వలు ఉన్నాయంటూ కేంద్రం వాటిని ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూ వచ్చింది. ఈ క్రమంలో ధరలు పెంచడం గమనార్హం. కాగా.. ఈ ప్రకటనలకు ముందే ఇంధన ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందనే వార్తలు దేశంలోని వాహనదారులను ఆందోళనకు గురిచేశాయి. దీంతో పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరారు. ఈ క్రమంలో కొన్ని బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. సీఎన్‌జీ వాహనదారులకు కూడా గ్యాస్ కంపెనీలు షాకిచ్చాయి. కిలో సీఎన్‌జీని రూ.2 చొప్పున పెంచాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ3.29, డీజిల్‌పై రూ.3.14, తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ఆయిల్ కంపెనీలు పెంచాయి. పెట్రోల్ ధరలు: ఢిల్లీలో రూ.97.77, కోల్‌కతాలో 108.74, ముంబయిలో 106.68 , చెన్నైలో 103.67 (?2.83)గా ఉండనున్నాయి. ఇక డీజిల్ ధరలు: ఢిల్లీలో 90.67, కోల్‌కతాలో 95.13, ముంబయి 93.14, చెన్నైలో 95.25గా ఉండనున్నాయి. దాంతో దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో వీటి ధరలు మారాయి. పశ్చిమాసియాలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలో ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాలని ఆయిలు కంపెనీలు నిర్ణయించాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన సంగతి తెలిసిందే.ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14పై పెంచాయి. తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచాయి.

# కేటీఆర్ చుట్టూ ఉచ్చు!



దీంతో విచారణకు స్వీకరించింది ఏసీబీ కోర్టు. ఇప్పుడు ఈ నోటీసులతో తప్పకుండా కేటీఆర్ విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది. విచారణలో భాగంగా కేటీఆర్ అరెస్టు ఉంటుందన్న అనుమానాలు కూడా ఉన్నాయి. కానీ ఏసీబీ అంతవరకు వెళ్లదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

**కేటీఆర్ శాఖ నుంచి డబ్బులు**

భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు హైదరాబాద్కు విశ్వవ్యాప్తంగా మరింత గుర్తింపు దక్కేలా చేస్తామంటూ.. ఫార్ములా ఈ కారు రేసులను నిర్వహించింది. ఇందుకోసం కారు రేసుల సంస్థకు రూ. 55 ఓట్లు చెల్లించింది. ఈ మొత్తాన్ని విదేశాల్లోని సంస్థకు చెల్లించేందుకు మరో రూ.10 కోట్ల మేర ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారన్నది ప్రధాన ఆరోపణ ఈ నిధులు కేటీఆర్ ఆధ్వర్యంలోని పురపాలక శాఖ నుంచే వెళ్లాయి. దీంతో కేటీఆర్ తో పాటు నాడు హెచ్‌ఎండిఏ చీఫ్ గా కొనసాగిన ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, చీఫ్ ఇంజనీర్ బి ఎల్ ఎన్ రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు తో పాటు ఈ కారు రేసుల సంస్థలపై కేసులు నమోదయ్యాయి.

**పలుమార్లు విచారణకు..**

విచారణలో భాగంగా కేటీఆర్ ఇప్పటికే ఏసీబీ అధికారుల ఎదుట హాజరయ్యారు. విడతల వారీగా జరిగిన ఈ విచారణలో అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు తాను సమాధానం ఇచ్చినట్లు.. విచారణల అనంతరం కేటీఆర్ స్పష్టం చేస్తూ వచ్చారు. ఇక అరవింద్ కుమార్ తో పాటు బిఎల్‌ఎన్ రెడ్డి కూడా ఏసీబీ విచారణకు హాజరవుతూ వస్తున్నారు. అయితే ముమ్మర విచారణ పూర్తి చేసిన ఏసీబీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. కోర్టు కేసు విచారణను జూలై 31కి వాయిదా వేసింది. తదుపరి విచారణకు హాజరు కావాలంటూ నిందితులకు కోర్టు సమన్లు జారీచేసింది. మొత్తానికి అయితే కేటీఆర్ చుట్టూ ఇప్పుడు ఉచ్చు బిగిస్తున్నట్టు అర్థం అవుతోంది.

# సీఎం రమేష్ వర్సెస్ పురందేశ్వరి!

(మొదటి పేజీ తరువాయి)

వేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. రేపు విదేశీ పర్యటనకు వెళ్ళనున్నారు ప్రధాని నరేంద్ర మోడీ. విదేశీ పర్యటన ముగించుకొని వచ్చిన తర్వాత క్యాబినెట్ విస్తరణ ఉంటుందన్న టాక్ నడుస్తోంది. చేర్పులు మార్పులతో పాటు యువతకు ఈసారి ప్రాధాన్యం ఇస్తారని తెలుస్తోంది. ప్రధానంగా తెలుగు రాష్ట్రాలకు ఈసారి ప్రాధాన్యం ఉంటుందని సమాచారం.

**ఒకరికి తప్పకుండా..**

ఏపీలో బిజెపి ఎంపీ ఒకరికి మంత్రి పదవి ఖాయం అన్న ప్రచారం నడుస్తోంది. ప్రధానంగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ పేరు వినిపిస్తోంది. మొన్నటి ఎన్నికల్లో పొత్తులో భాగంగా బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు రమేష్. కడప జిల్లాకు చెందిన ఆయన ఉత్తరాంధ్ర నుంచి పోటీ చేసి అత్యధిక మెజారిటీతో గెలవడం విశేషం. అయితే అప్పట్లోనే సీఎం రమేష్ ను క్యాబినెట్ లోకి తీసుకుంటారన్న ప్రచారం నడిచింది. కానీ అనూహ్యంగా నరసాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాస వర్మ కు ఛాన్స్ దక్కింది. అయితే ఈసారి వెనుకబడిన వర్గాలకు అవకాశం ఇస్తారని తెలుస్తోంది. ఆ కోటాలో సీఎం రమేష్ పేరును ప్రముఖంగా పరిగణలోకి తీసుకుంటున్నట్లు సమాచారం. కేంద్ర పెద్దలతో ఆయనకు ఉన్న సన్నిహిత సంబంధాలు కలిసి వచ్చే అంశం.

**చిన్నమ్మకు గట్టి పోటీ..**

మరోవైపు రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి పేరు సైతం ప్రముఖంగా వినిపిస్తోంది. ప్రస్తుతం సీఎం రమేష్ కు ఆమె గట్టి పోటీగా నిలుస్తున్నట్లు తెలుస్తోంది. అయితే బిజెపి నుంచి కేవలం ముగ్గురే గెలిచారు. అందులో నరసాపురం ఎంపీపీ మంత్రిగా అవకాశం దక్కింది. మిగిలింది ఈ ఇద్దరు మాత్రమే. అయితే పురందేశ్వరి సైతం గతంలో కేంద్ర మంత్రి పదవి చేపట్టడంతో కలిసి వచ్చే అంశం. మొన్నటి ఎన్నికల్లో ఆమె బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉండేవారు. టిడిపి తో పొత్తు వెనుక అటు సీఎం రమేష్.. ఇటు పురందేశ్వరి కీలకంగా వ్యవహరించారు. కానీ ఇప్పటికే పురందేశ్వరి సామాజిక వర్గానికి చెందిన పెమ్మసాని చంద్రశేఖర్ మంత్రిగా ఉండడంతో.. ఆమెకు చిన్నపాటి ఇబ్బంది. అయితే వెనుకబడిన తరగతులు వారికి మంత్రి పదవి ఇస్తామనుకుంటే మాత్రం.. కచ్చితంగా సీఎం రమేష్ కు అవకాశం దక్కుతుంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# షర్మిల పాదయాత్ర!

కాంగ్రెస్ సర్కార్ ఉంది. ఈ మూడు రాష్ట్రాల సహకారంతో రాయలసీమపై గట్టి ప్లాన్ చేస్తున్నారు షర్మిల.

**జగన్మోహన్ రెడ్డికి అవకాశం ఇవ్వకుండా..**

రాయలసీమపై వైయస్సార్ కుటుంబ ప్రభావం అధికంగా ఉండేది. ముఖ్యంగా కడప జిల్లాలో ఆ కుటుంబానికి తిరుగులేని రాజకీయ ఆధిపత్యం. కానీ మొన్నటి ఎన్నికల్లో ఆ ప్రభావం పనిచేయలేదు. జగన్మోహన్ రెడ్డి దారుణంగా దెబ్బతిన్నారు. అందుకే కడప జిల్లాతో పాటు రాయలసీమపై ఆయన ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. అందుకే షర్మిల సైతం ఆ ప్రాంతంపై పట్టు బిగించేందుకు పాదయాత్రకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లో పాదయాత్ర చేయాలని ఆమె స్ట్రాంగ్ గా డిసైడ్ అయినట్లు సమాచారం. వచ్చే ఏడాదిలో ఆమె పాదయాత్ర ఉంటుందని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం ఉంది.

**వెంటనే బస్సు యాత్ర..**

మరోవైపు కోస్తాంధ్రతో పాటు ఉత్తరాంధ్రలో షర్మిల బస్సు యాత్రకు సైతం సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. రాయలసీమలో పాదయాత్ర ముగిసిన వెంటనే బస్సు యాత్రకు సన్నాహాలు మొదలు పెడతారని సమాచారం. కాంగ్రెస్ పార్టీని యాక్టివ్ చేసే విధంగా.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసే విధంగా ఆమె పావులు కదుపుతున్నట్లు అర్థమవుతుంది. అన్నింటికీ మించి వచ్చే ఎన్నికల్లో వామపక్షాలతో పాటు మిగతా రాజకీయ పార్టీలతో పొత్తు పెట్టుకోవాలని కాంగ్రెస్ ఆలోచన చేస్తోంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని పెంచుకుంటుంది జాతీయస్థాయిలో. ఇదే ఊపుతో రాయలసీమలో పట్టు బిగించడం ద్వారా.. 2029 ఎన్నికల్లో ఓట్లతో పాటు సీట్లు కూడా పొందాలని చూస్తోంది కాంగ్రెస్. అందుకే షర్మిల పాదయాత్రకు హై కమాండ్ సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# ఇండియా కూటమి బలోపేతం!

కబళిస్తూ వచ్చింది బిజెపి. దేశంలో మెజారిటీ ప్రాంతీయ పార్టీలన్నీ ఇప్పుడు బిజెపికి వ్యతిరేకంగానే ఉన్నాయి. అయితే అలాగని ఆ పార్టీలు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమిలో చేరలేదు. కానీ ఇప్పుడు బీజేపీ హవాను తట్టుకోవాలి అంటే ఆ పార్టీలన్నీ ఇప్పుడు ఇండియా కూటమి వైపు వెళ్లాల్సిందే.

**ప్రతి రాష్ట్రంలోనూ ఓటమి..**

ప్రతి రాష్ట్రం లోనూ ప్రాంతీయ పార్టీలను ఓడించి అధికారంలోకి వస్తోంది భారతీయ జనతా పార్టీ. ఈ జాబితా చూస్తే చాలా ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్, శివసేన ఉద్ధవ్ ఠాక్రే, నవీన్ పట్నాయక్, కెసిఆర్, అఖిలేష్ యాదవ్, వైయస్ జగన్మోహన్ రెడ్డి, స్టాలిన్.. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రాంతీయ పార్టీల అధినేతలు ఇప్పుడు భారతీయ జనతా పార్టీని తట్టుకోవడం ఎలా అని ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ చూస్తే స్వల్ప బలం పెంచుకుంటూ ముందుకు సాగుతోంది. అందుకే ఆ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమిని బలోపేతం చేస్తే మంచి ఫలితం ఉంటుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. 2029 సార్వత్రిక ఎన్నికలకు మరో మూడు సంవత్సరాల సమయం ఉంది. ఈ పరిస్థితుల్లో ఇండియా కూటమిని బలోపేతం చేస్తే ఎన్డీఏ ను అధికారం నుంచి దూరం చేయవచ్చు అనేది ఒక అంచనా.

**లి కాంగ్రెస్ కు జై కొట్టక తప్పదు**

ప్రాంతీయ పార్టీలు సహజంగానే జాతీయ పార్టీల ఆధిపత్యాన్ని సహించవు. ఎన్డీఏకు వ్యతిరేకంగా ఇండియా కూటమి పుట్టుకొచ్చింది. దానికి కాంగ్రెస్ నేతృత్వం వహించింది. అది ఎంత మాత్రం ప్రాంతీయ పార్టీలకు మింగుడు పడలేదు. ఎందుకంటే కాంగ్రెస్ దేశంలో బలహీన పడింది. ఆ పార్టీ కంటే బలంగా ఉన్నామన్న అభిప్రాయం ప్రాంతీయ పార్టీల్లో ఉండేది. అందుకే ఇండియా కూటమి ఐక్యంగా ముందుకు సాగలేకపోయింది. అయితే దేశంలో పేరు మోసిన దాదాపు అన్ని ప్రాంతీయ పార్టీలు ఇప్పుడు కనుమరుగయ్యాయి. ఆ పార్టీల నేతలు ఇప్పుడు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమిలో పనిచేయాల్సిన అనివార్య పరిస్థితి ఎదురైంది. ముఖ్యంగా మమతా బెనర్జీ ఓడిపోవడంతో ఆమె కాంగ్రెస్ పార్టీతో రాజీ పడక తప్పదు. ఇండియా కూటమికి కాంగ్రెస్ సారధ్య బాధ్యతలు అప్పగించాల్సిన పరిస్థితి కూడా మిగతా రాజకీయ పార్టీలకు ఏర్పడింది. ముందుందు ఇండియా కూటమి మరింత బలపడే ఛాన్స్ కనిపిస్తోంది.

# రాయలసీమలో చారిత్రక ఘట్టం!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** రాయలసీమలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. పారిశ్రామిక ప్రస్థానంలో ఒక మైలురాయికి చేరింది రాయలసీమ. శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి లో ఐదోతరం యుద్ధ విమానాల తయారీ, ఇంటిగ్రేషన్, టెస్టింగ్ సెంటర్లకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్, ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. భారతదేశంలో స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిస్తున్న మొట్టమొదటి ఐదోతరం యుద్ధ విమానం ఏఎంసిఏ కు పుట్టపర్తి ప్రధాన కేంద్రంగా మారబోతోంది. సుమారు 650 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరుపుకుంటుంది. దాదాపు రూ.15,803 కోట్ల అంచనా వ్యయంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ యుద్ధ విమానాల విడిభాగాల తయారీ, అసెంబ్లింగ్, వాటి పనితీరు పరీక్షించే అధునాతన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

**వేలాదిమందికి ఉపాధి..**

పుట్టపర్తి లో ఏర్పాటు చేసే ఈ పరిశ్రమ ద్వారా సుమారు 7500 మందికి ప్రత్యక్ష ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పరోక్షంగా వేల కుటుంబాలు బతికే అవకాశం ఉంది. కేవలం విమానాల తయారీకి పరిమితం కాకుండా.. దీని చుట్టూ అనేక అనుబంధ పరిశ్రమలు కూడా ఏర్పాటు అవుతాయి. ప్రధానంగా డిఫెన్స్ ఎనర్జిటిక్స్, మందు గుండు సామాగ్రి తయారీ ప్లాంట్లు, డ్రోన్ సిటీ ప్రాజెక్టులకు కూడా ఇదే వేదిక నుంచి శంకుస్థాపనలు చేశారు సీఎం చంద్రబాబు. ఏపీ ప్రభుత్వం చూపిస్తున్న చొరవ వల్ల ఏపీ త్వరలోనే నేషనల్ డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గా మారుతుందని రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్ ప్రశంసించారు.

**స్థానికంగా యువతకు ఉపాధి..**

రాయలసీమ యువతకు ఇక్కడే అంతర్జాతీయ స్థాయి ఉపాధి లభిస్తుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇది సాధ్యమైందని చెబుతున్నారు. ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోడీకి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. ప్రతిభ కలిగిన మన యువతకు ఈ పరిశ్రమలు ఒక వేదికగా మారుతాయని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో యుద్ధ విమానాల విడిభాగాలను మన రాష్ట్రంలో తయారయ్యేలా అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహిస్తామని లోకేష్ స్పష్టం చేశారు. గతంలో మన రక్షణ పరికరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడే వారమని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ అవసరాలను ఏపీ తీర్చనుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమము ఉత్సాహ భరిత వాతావరణంలో సాగింది. పలువురు రాష్ట్ర మంత్రులు కూడా పాల్గొన్నారు..





# చెన్నారం చెరువులో నల్లమట్టి మాఫియా..

**నిబంధనలు గాలికి.. కాసుల వేటలో పర్యావరణానికి తూట్లు..**


**దేవరకొండ నియోజకవర్గంలో వెలుగుచూసిన కుంభకోణం..**

**ఒకే వే-బిల్లుతో రోజంతా దందా..**

**ప్రజాప్రతినిధి అనుచరుడి కనుసన్నల్లో అక్రమ తవ్వకాలు!**

**అనుమతులు గోరంత.. దోపిడీ కొండంత అన్నట్లుగా మారింది, మల్లేపల్లి మండలం చెన్నారం గ్రామ చెరువు పరిస్థితి. చెరువు పూడికతీత పేరుతో మొదలైన వ్యవహారం, ఇప్పుడు పచ్చని పర్యావరణాన్ని కాటేస్తూ, ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న భారీ 'బ్లాక్ దందా'గా రూపాంతరం చెందింది. ఈ అక్రమ తవ్వకాల వెనుక దేవరకొండ నియోజకవర్గానికి చెందిన కీలక నేత, అనుచరుడి అండదండలు ఉండటంతో, అధికారులు అటువైపు కన్నెత్తి చూడటానికే భయపడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..!?**

నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్)




**రాజకీయ అండతో చెలరేగుతున్న 'ముఠా'!!?**

దేవరకొండ నియోజకవర్గ స్థాయికి చెందిన ఒక కీలక ప్రజాప్రతినిధికి, ప్రధాన అనుచరుడిగా చలామణినని చెప్పుకుంటున్న ఓ వ్యక్తి ఈ మట్టి దందాను అన్నీ తానై నడిపిస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి...!? కేవలం రాజకీయ పలుకుబడే కాకుండా, ఈ దందాను సజావుగా సాగించేందుకు ఒక అగ్నిమాపక శాఖ అధికారి!? కూడా, తెరవెనుక చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.! ఈ అధికారికి ఈ అక్రమ లాభాల్లో భారీగా వాటా అందుతోందని, అందుకే ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. మరో ఇద్దరు ప్రైవేటు వ్యక్తులతో కలిసి ఈ 'త్రిమూర్తుల' ముఠా చెరువు గర్భాన్ని ఛిద్రం చేస్తోంది.

**ఒకే వే-బిల్లు.. రోజంతా తిరుగుతున్న టిప్పర్లు!**

మైనింగ్ నిబంధనల ప్రకారం ప్రతి ట్రిప్పుకు ఒక వే-బిల్లు ఉండాలి. కానీ ఇక్కడ సీన్ రివర్స్, ఉదయం ఒక బిల్లు తీసుకుని, అదే బిల్లును అడ్డుపెట్టుకుని రోజంతా వందలాది ట్రిప్పుల మట్టిని తరలిస్తున్నారని తెలుస్తుంది.!? నిర్ణీత సామర్థ్యానికి మించి మట్టిని నింపడం వల్ల గ్రామీణ రోడ్లు పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. కూలీల ప్రాణాలను, స్థానికుల భద్రతను పట్టించుకోకుండా టిప్పర్లు అతివేగంతో గ్రామ వీధుల గుండా దూసుకుపోతున్నాయి. నిరంతరం సాగుతున్న ఈ రవాణాతో గ్రామం మొత్తం ధూళి మేఘంగా మీద పడిపోతుంది. ?రోజువారీగా తవ్వకాలను పర్యవేక్షించాల్సిన రెవెన్యూ, మైనింగ్, పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. కళ్లెదుటే చెరువు గుంటలమయమవుతున్నా, భూగర్భ జలాలు అడుగంటుతున్నా పట్టించుకోకపోవడం వెనుక 'మామూళ్ల' మత్తు ఉందనేది ప్రచారం సాగుతుంది.!? రాత్రి వేళల్లో కూడా యథేచ్ఛగా సాగుతున్న ఈ దందాపై, జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని, తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చెరువు మట్టి తవ్వకాల వల్ల కేవలం సహజ వనరులు కోల్పోవడమే కాకుండా, భవిష్యత్తులో సాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉంది. ఒక ప్రభుత్వ అధికారి, రాజకీయ అనుచరులు కుమ్మక్కై చేస్తున్న ఈ నల్లమట్టి వ్యాపారంపై ఉన్నతాధికారులు స్పందించకపోతే, ప్రజలే రోడ్లపైకి వచ్చి పోరాడేందుకు సిద్ధమవనున్నారని చర్చ జరుగుతుంది..

# 64 లక్షల విలువ చేసే 128 కేజీల గంజాయి పట్టుకున్న వైరా పోలీసులు

**ఒడిశా నుండి తమిళనాడుకు గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు**

**ఈ అక్రమ రవాణాకు సంబంధించి ముగ్గురు అంతర్రాష్ట్ర నిందుతులు అరెస్టు..**

**మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన వైరా ఏసీపీ సారంగపాణి.**



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** శుక్రవారం వైరా ఎస్ఐ రామారావు తన సిబ్బందితో కలిసి వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామం వద్ద అంజనేయస్వామి దేవాలయం సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించేందుకు వెళ్తుండగా, రోడ్డుపక్కన ఐదు గోనె సంచులతో అనుమానాస్పదంగా నిలబడి ఉన్న ముగ్గురు వ్యక్తులను గుర్తించారు. వారిని తనిఖీ చేయగా, ఐదు గోనె సంచులలో మొత్తం 60 ప్యాకెట్లలో సుమారు 64 లక్షల రూపాయల విలువ చేసే 128 కిలోల ఎండు గంజాయిని ఒరిస్సా లోని మల్కనగిరి ప్రాంతం నుండి తమిళనాడు కు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి గంజాయిని స్వాధీనం చేసుకొని, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు.

**అరెస్టు చేసిన నిందితులు:** మనుయాల్ బోత్రా (22 సం။లు) రాబా కాలనీ దొరగూడ పంచాయతీ చిత్రకొండ బ్లాక్ మల్కాంగిరి జిల్లా ఒడిశా చిటికల సన్యాసినాయుడు (25 సం။లు) నాతవరం మండలం అనకాపల్లి జిల్లా ఆంధ్రప్రదేశ్‌లక్ష్మణ్ కిలో (24 సం။లు) కమర్గూడ బోడపాద్దూర్ చిత్రకొండ పోలీస్ స్టేషన్ పరిధి మల్కాంగిరి జిల్లా ఒడిశాపోలీసుల హెచ్చరిక: సమాజాన్ని నాశనం చేస్తున్న మాదకద్రవ్యాల వ్యాపారం రవాణా వినియోగం వంటి అక్రమ కార్యకలాపాలపై ఖమ్మం కమిషనరేట్ పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తారు యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని ప్రజలను కోరుతున్నారు. "డ్రగ్స్‌కు దూరంగా ఉండండి -- భవిష్యత్తును కాపాడుకోండి" అని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గండిపేట(క్రైం మిర్రర్): రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బండ్లగూడ ప్రాంతానికి చెందిన వుయ్యాల సరిష్(23) విద్యార్థి. శుక్రవారం ఉదయం తన స్నేహితులు క్రిష్‌సింగ్‌తో కలిసి కాళీమందిర్ వద్ద టిఫిన్ చేసి తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలో సన్‌సిటీ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సమీపంలో వారు ప్రయాణిస్తున్న టిజి07ఏఆర్0605 అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న అడ్వర్టై?టజ్‌మెంట్ బోర్డును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వుయ్యాల సరిష్ తలకు తీవ్ర రక్తగాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మరో వ్యక్తి క్రిష్‌సింగ్‌కు రక్తగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 'వయసు' అసలు పాయింట్!

(మొదటి పేజీ తరువాయి)

బాధితురాలి వయస్సు తీవ్ర ఉత్కంఠకు కారణం అవుతోంది. ఈ కేసులో నిందితుడి భవిష్యత్తు పూర్తిగా అమ్మాయి మైనరా? మేజరా? అనే పాయింట్ చుట్టూ ఆధారపడి ఉంది. ఒకవేళ ఆమె మైనర్ అని న్యాయస్థానంలో నిరూపితమైతే.. బండి భగీరథ్ పై పోక్సో చట్టం కింద కఠిన శిక్షలు తప్పవు. అదే మేజర్ అని తెలిస్తే మాత్రం.. పరస్పర అంగీకారంతో జరిగిన వ్యవహారంగా పరిగణించి సాధారణ తీర్పులు వచ్చే అవకాశం ఉంది.

**పాఠశాల రికార్డుల పరిశీలన..:** ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. బాధితురాలి పాఠశాల రికార్డులు, మున్సిపల్ బర్త్ సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఒకవేళ సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్నట్టుగా ఆమె మేజర్ అని నిరూపించగలిగితే నిందితుడికి ఊరట దక్కే చాన్స్ ఉంది. ఎందుకంటే గతంలోనూ సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా చెప్పింది. ఇద్దరు మేజర్లు ఇష్టపూర్వకంగా కలిసి ఉన్నప్పుడు.. ఆ తరువాత మనస్పర్థలు కారణంగా రేప్ కేసులు పెట్టుకుంటామంటే కుదరదు. ఈ విషయాన్ని అత్యున్నత న్యాయస్థానం చెప్పడంతో.. ఇప్పుడు బాధితురాలి వయస్సు అనేది అసలు పాయింట్ గా మారింది. మైనర్ వయస్సును నిర్ధారించడానికి న్యాయస్థానాలు కొన్ని రకాల నిబంధనలు పాటిస్తాయి. మొదటిగా పాఠశాల రికార్డులు లేదా పదో తరగతి సర్టిఫికెట్. ఇవి అందుబాటులో లేకపోతే మున్సిపాలిటీ/ పంచాయితీ జారీ చేస్తే బర్త్ సర్టిఫికెట్లను పరిగణలోకి తీసుకుంటారు. ఇవన్నీ లేని పక్షంలో వైద్య పరీక్షల ద్వారా వయస్సును అంచనా వేస్తారు. ఈ కేసులో ప్రాథమికంగా విద్యాశాఖ రికార్డుల ప్రకారం ఆమె మైనర్ అని తేలితే.. వేరే వాదనలకు తావుండదు.

**జిహెచ్ఎంసి రికార్డులు సైతం..:** ఈ కేసులో వెలుగులోకి వచ్చినప్పుడు ఆమె మైనర్ అనే అనుమానాలు బలంగా వినిపించాయి. కానీ తర్వాత సోషల్ మీడియాలో విభిన్న పుట్టిన తేదీల ఆరోపణలు వచ్చాయి. అందుకే ఈ కేసు విచారణకు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం.. లోతైన విచారణ చేపడుతోంది. జిహెచ్ఎంసి రికార్డుల్లో పుట్టిన తేదీ ఎప్పుడు నమోదయింది? పుట్టిన వెంటనే నమోదు చేశారా? లేకుంటే ఏమైనా ప్రయోజనాల కోసం తర్వాత మార్పులు చేశారా? అన్న కోణంలో ఆరా తీస్తున్నారు. ఒకవేళ రికార్డుల్లో ట్యాంపరింగ్ జరిగినట్లు తేలితే కేసు మరో మలుపు తిరుగుతుంది. అయితే పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో ఆమెను మైనర్ గా గుర్తించి ఫోక్సో సెక్షన్లను చేర్చారు. వీటిని కొట్టివేయాలంటే పక్క ఆధారాలు దొరకాలి. తెలంగాణ రాజకీయాల్లో ఇదో హై ప్రొఫైల్ కేసుగా మారింది.

# కరూర్ మృతుడి తల్లికి విజయ్ పాదాభివందనం!

ప్రమాణ స్వీకారం చేశారు. మిగతా రాజకీయ పక్షాల మద్దతుతో తమిళనాడులో దశాబ్దాల చరిత్ర కలిగిన రెండు పార్టీలను కాదని అధికారంలోకి వచ్చారు. అయితే ఆ పార్టీలకు భిన్నంగా వెళ్లాలన్న ఆలోచనతో ఉన్నారు. అలానే అడుగులు వేస్తున్నారు దళపతి విజయ్.

**ప్రారంభంలోనే కష్టాలు..:** తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్ పొలిటికల్ ఎంట్రీ సమయంలోనే అనేక కష్టాలను ఎదుర్కొన్నారు. మొన్నటి ఎన్నికలకు ముంగిట కరూర్ లో ఆయన నిర్వహించిన రోడ్డు షో లో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. తొక్కిసలాట ఘటనలో ప్రమాదవశాత్తు చనిపోయారు. ఆ ఘటనతో విజయ్ రాజకీయం ఇక ముగిసినట్టేనని అంతా భావించారు. అయితే ఏమాత్రం ధైర్యం వీడని విజయ్ ముందుకు సాగారు. ఏకంగా తమిళనాడు ముఖ్యమంత్రిగా పదవి చేపట్టారు.

**ఎంతో మనోవేదనకు..:** కరూర్ ఘటనతో విజయ్ ఎంతో మనోవేదనకు గురయ్యారు. నిద్రలేని రాత్రులు గడిపారు. ఒకానొక దశలో కేంద్ర సంస్థలు, దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగుతాయని.. విజయ్ అరెస్టు తప్పదన్న ప్రచారం నడిచింది. అప్పుడే బిజెపితో పొత్తుల కథ కూడా బయటకు వచ్చింది. కానీ విజయ్ వెనక్కి తగ్గలేదు. కానీ కరూర్ తొక్కిసలాట ఘటనను మాత్రం చాలా సెంటిమెంట్ గా తీసుకున్నారు విజయ్. విజయ్ సీఎం అయిన నేపథ్యంలో పలు జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థలు విజయ్ ప్రస్థానానికి సంబంధించిన ప్రత్యేక కథనాలను ప్రచురించాయి. అందులో భాగంగా బీబీసీ మీడియా కరూర్ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన ఓ బాలుడి కుటుంబాన్ని కలిసింది. అయితే ఆ మీడియా ప్రతినిధి ముందు ఆ బాలుడి తండ్రి సంచలన విషయాలను బయటపెట్టారు. విజయ్ గొప్పతనాన్ని.. కరూర్ ఘటన ఆయనను ఎంతగా బాధించిందన్న విషయాన్ని కళ్లకు కడుతూ కొన్ని ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. తమను పరామర్శించడానికి వచ్చిన సందర్భంలో కుర్చీలో కూర్చున్న తన భార్య కాళ్లను తాకిన విజయ్.. కరూర్ తొక్కిసలాటకు కారణమైన తనను మన్నించాలని వేడుకున్నారట. అల్లారం ముద్దుగా పెంచుకుంటున్న వారి కుమారుడు తొక్కిసలాటలో చనిపోయాడు. ఆ కుటుంబానికి తీరని మనోవేదన ఎదురైంది. అయినా సరే ఆ కుటుంబం విజయ్ పార్టీకి ఓటు వేసేందట. ఎన్నికల ప్రచారంలో చెప్పినట్టు విజయ్ పాలన కొనసాగిస్తే మరోసారి ఆయన పార్టీకి ఓటు వేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఆ బాలుడి కుటుంబం స్పష్టం చేసినట్టు బీబీసీ తన కథనంలో వెల్లడించింది.

GHMC
hmda Growing Global
TS-bPASS

MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్

# ఎడిటోరియల్

4

శనివారం
16-5-2026



కొందరు మాఫియాతో చేతులు కలపడం వల్లనే పేపర లీకేజీలు జరుగుతున్నాయి. వారిని గుర్తించాలి. కఠినంగా శిక్షించాలి. నీట్ పేపర్ దోషులకు కఠిన శిక్షలు పడితే తప్ప ఇలాంటి తప్పిదాలు పునరావృతం అవుతూనే ఉంటాయి. ఒకప్పుడు టెన్త్ లేదా ఇంటర్ పరీక్ష పేపర్లు లీక్ అయితే సంబంధిత మంత్రి రాజీనామా చేసేవారు. అంతగా నైతిక బాధ్యత వహించేవారు.

కానీ నీట్ పేపర్ లీక్ కావడం లక్షల మంది విద్యార్థుల భవితవ్యాన్ని ప్రమాదంలో పడేసింది. దేశంలో వైద్య విద్య పట్టణ ప్రాంతాల్లోని ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాల వారికే అందుబాటులో ఉంది. సామాన్యులు వైద్య విద్య చదివించడం దాదాపు అసాధ్యమైన పరిస్థితి ఏర్పడింది. గతంలో ప్రతి రాష్ట్రం ఎంసెట్ నిర్వహించుకోవడంతో ఇలాంటి బాధలు ఉండేవి కావు. నీట్‌ను తమిళనాడు అస్సలు ఒప్పుకోలేదు. కానీ 2017లో మోడీ ప్రభుత్వం కేంద్రీకరణ విధానాల్లో భాగంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టిఎను తీసుకొచ్చి, రాష్ట్రాల పరిధిలో ఉన్న వైద్య విద్య ప్రవేశార్హత నీట్ లో భాగం చేశారు. అన్ని పరీక్షలను తన చెప్పు చేతల్లో ఉంచుకోవాలన్న మోడీ ప్రభుత్వ విధానంతో లీక్ లు, అవకతవకలు షరా మామూలుగా మారిపోయాయి. నీట్ విధానం అన్యాయమని, ఈ విధానాన్ని రద్దు చేసి, వికేంద్రీకరించాలని దక్షిణాది రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, కర్ణాటక అసెంబ్లీలో తీర్మానాలు చేశాయి. దాదాపు 400 మందితో ఏర్పడిన ఎన్‌టిఎ నీట్ సహా 46 పరీక్షలను సమన్వయం చేయాల్సి ఉండటం, అందులోనూ అనర్హులు, అక్రమార్కులు భాగస్వాములు కావడం వల్ల ఇవాళ నీట్ పరీక్ష రద్దుకు కారణమయ్యింది. గతంలో నాలుగు సార్లు నీట్, ఒకసారి యుజిసి నెట్ లీక్ కావడమే ఇందుకు నిదర్శనం. 2024లో నీట్ యుజి పరీక్ష అవకతవకలపై బీహార్‌లో అరెస్టులు, సకాలంలో పేపర్ ఇవ్వక పోవడం వల్ల గ్రేస్ మార్క్ లు ఇవ్వాల్సి రావడం సహా ఎన్నో అంశాలు కలకలం రేపాయి. చర్చనీయాంశం అయ్యాయి. పూర్తి భద్రతా ప్రోటోకాల్ పాటించామని, జిపిఎస్


# ఎన్‌టిఎ వైఫల్యంతో విద్యార్థులకు శాపం!

ట్రాక్ చేసిన వాహనాలు, ఎ.ఐ నియంత్రిత సిసి టివి, బయోమెట్రిక్, 5 జి జామర్లు వంటి చర్యలు తీసుకున్నామని ఎన్‌టిఎ చెబుతున్నా అక్రమాలు జరుగుతున్నాయంటే పేపర్ లీక్ మాఫియాను అరికట్టడంలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. విద్యార్థుల కలలను భగ్నం చేసే పేపర్ లీక్ లను అడ్డుకోకపోగా, కనీసం నోరుమెదపని ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉండటం సిగ్గుచేటు. పరీక్షా పే చర్చ అంటూ విద్యార్థులతో చర్చించే ప్రధానికి ఏటా జరుగుతున్న పేపర్ లీక్ లపై కనీసంగా మాట్లాడడం లేదు. అవిశ్రాంతంగా శ్రమించి ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు మరోసారి మానసిక ఒత్తిడి, తల్లిదండ్రులపై ఆర్థిక భారం, అనిశ్చితితో శిక్ష అనుభవిస్తున్నారు. వ్యవస్థ ఇన్ని లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుంటే మోడీ ఇప్పుడు ఎందుకు మాట్లాడరన్నదే ప్రశ్న. నిజానికి నీట్ పరీక్షను తప్పించి ఆయా రాష్ట్రాలకు మునుపటి మాదిరి ఎంసెట్ నిర్వహించుకునే వెసలుబాటు కల్పిచడం మేలు. లేదా నీట్ వైఫల్యాలపై చర్యలు తీసుకోవాలి. సిబిఐ విచారణకు ఆదేశించినా అది ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది కూడా అనుమానమే. పేపర్ లీక్ పై కేంద్రప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలి. బాధ్యులకు కఠిన శిక్షలు పడేలా చేయాలి. విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలి. ఈ నెల 3వ తేదీన నిర్వహించిన నీట్ (యూజీ)–2026 పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసింది. పరీక్షను మళ్లీ నిర్వహించటం అనేక మంది విద్యార్థులకు, వారి కుటుంబాలకు ఇబ్బంది కలిగించే నిర్ణయమేనని చెప్పకతప్పదు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశించింది. పరీక్ష రద్దు నేపథ్యంలో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ పరీక్ష రాయాల్సిన దుస్థితి నెలకొంది. సాధారణంగా ఈ అక్రమాలు గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతుంటాయి. అయితే, ఈసారి ఏజెంట్లు ఒకర్ని మించి మరొకరు సొమ్ము చేసుకునే ఉద్దేశంతో విచ్చలవిడిగా పేపర్‌ను అమ్మటంతో ఈ వ్యవహారం బయటపడింది. ఇలా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం కేవలం కేంద్ర వైఫల్యంగానే చూడాలి. వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) కుంభకోణాలకు ఆలవాలంగా మారడం గర్హనీయం. ఈ నెల 3న జరిగిన నీట్ యుజి 2026 పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని తేలడంతో పరీక్షను రద్దు చేసి, సిబిఐ విచారణకు జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఆదేశించింది. పేపర్ లీక్, పరీక్ష రద్దుతో 22 లక్షల మంది విద్యార్థులు అనవసరమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పరీక్షలకు 42 గంటల ముందే రాజస్థాన్‌లోని సీకర్‌లో వాట్సాప్ లో అందుబాటు లోకి వచ్చిన 'అంచనా పేపర్' లో కెమిస్ట్రీ, బయాలజీ విభాగాల్లో 120 నుంచి 140 ప్రశ్నలు నీట్ పరీక్షలో వచ్చాయంటే పరీక్ష నిర్వహణలో డొల్లతనం వెల్లడవుతుంది. ఈ పేపర్‌లోని ప్రశ్నలు ప్రిపేరైన విద్యార్థులు 720 మార్కుల్లో 600 వరకు స్కోర్ చేసి ఉండవచ్చన్నది నిపుణుల మాట. ఈ నెల 1 నుండి అంచనా పేపర్ అభ్యర్థులకు చేరిందని, రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకూ విక్రయించారని అధికారులు గుర్తించి, పలువురు నిందితులను అరెస్టు చేశారు. ఏదేమైనా ఇలాంటి విషయాల్లో కేంద్రం కఠినంగా వ్యవహరించాల్సి ఉంది.

# భక్తికి బుద్ధి తోడవ్వకపోతే... అది ముక్తి కాదు, ముప్పు!

మానవ జీవితం అనే మహాప్రయాణంలో భక్తి అనేది ఒక స్వచ్ఛమైన సెలయేరు వంటిది. అది గుండెను తడిపే తన్మయత్వం, ఆత్మను పరమాత్మతో అనుసంధానించే అద్భుతమైన వంతెన. దేవుని పట్ల అచంచలమైన నమ్మకం, గురువు పట్ల అపారమైన గౌరవం, సత్యం పట్ల నిబద్ధత ఇవన్నీ భక్తికి రూపాలే. అయితే, ఈ భక్తి అనే ప్రయాణానికి బుద్ధి అనే దిశానిర్దేశం లేకపోతే ఏమవుతుంది? గమ్యం తెలియని దారిలో, కళ్ళు మూసుకుని పరుగు తీస్తున్న చందమే అవుతుంది. ఒక మహావృక్షానికి వేళ్ళు ఎంత అవసరమో, భక్తి అనే సౌధానికి వివేకం అనే పునాది అంత ముఖ్యం.

పునాది లేని కట్టడం కాల గమనంలో కూలిపోక తప్పదు. అందుకే, బుద్ధి లేని భక్తి అంధత్వం అనే నిగ్గుతేలిన సత్యాన్ని నేటి ఆధునిక కాలానికి అన్వయించుకుంటూ లోతుగా విశ్లేషించుకుందాం. సాధారణంగా మనం భక్తి అంటే గుడికి వెళ్లడం, పూజలు చేయడం లేదా మొక్కులు తీర్చుకోవడం అనుకుంటాం. కానీ భక్తి అనే పదానికి అంతకంటే లోతైన అర్థం ఉంది. సంస్కృతంలోని 'భజ్' అనే ధాతువు నుండి పుట్టిన ఈ పదానికి సేవ లేదా ప్రేమతో కూడిన ఆత్మార్పణ అని అర్థం. ఇది భగవంతుడికి, భక్తుడికి మధ్య ఉండే ఒక సున్నితమైన, పవిత్రమైన అనుబంధం. మన భారతదేశ చరిత్రను గమనిస్తే మీరాబాయి కృష్ణ ప్రేమలో మునిగిపోయింది, అన్నమాచార్య వేంకటేశ్వరుడిని కీర్తించాడు, కబీర్ మానవత్వాన్ని చాటాడు. వీరంతా మహా భక్తులే. కానీ, వారి భక్తిలో ఒక స్పష్టత ఉంది, ఒక లోతైన జ్ఞానం ఉంది. వారు ఎప్పుడూ మూఢత్వాన్ని ప్రోత్సహించలేదు. నిజమైన భక్తి అంటే అంధానుసరణ కాదు; అది వివేకంతో కూడిన శరణాగతి. తనను తాను తెలుసుకుంటూ, దైవాన్ని వెతుక్కోవడమే అసలైన భక్తి మార్గం. దురదృష్టవశాత్తూ, నేటి సమాజంలో భక్తి అనే పేరుతో ఎన్నో వికృత పోకడలు చోటుచేసుకుంటు న్నాయి. భక్తిని బుద్ధి అనే జల్లెడలో వడపోయకపోవడం వల్ల కలిగే నష్టాలు అన్నీ ఇన్నీ కావు. అంధ భక్తి వల్ల మనుషులు మత విద్వేషాలకు లోనవుతున్నారు, మూఢ నమ్మకాల ఉచ్చులో చిక్కుకుంటున్నారు. నకిలీ స్వాముల మాయమాటలను వేదవాక్కులుగా నమ్మి, కష్టపడి సంపాదించిన ఆస్తులను వారి పాదాల చెంత పోస్తున్నారు. ఇది ఆధ్యాత్మికత కాదు, మానసిక బానిసత్వం. ఆరోగ్యం క్షీణిస్తే ఆసుపత్రికి వెళ్లకుండా, దేవుడే చూసుకుంటాడు అని ప్రాణాల మీదకు తెచ్చుకోవడం భక్తి అనిపించుకుంటుందా? పిల్లలకు చదువు చెప్పించకుండా, అంతా విధి రాత అని చేతులు కట్టుకుని కూర్చోవడం వివేకమా? ఇది దైవ సేవ కాదు, కచ్చితంగా స్వీయ హింసే. చరిత్రలో సతీ సహగమనం, బాల్య వివాహాలు, అస్పృశ్యత వంటి సామాజిక జాడ్యాలను మతం పేరుతోనే సమర్థించుకున్నారు. కానీ, రాజా రామ్ మోహన్ రాయ్, జ్యోతిబా పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహానుభావులు తమ బుద్ధి బలాంతో ఆ అంధకారాన్ని ప్రశ్నించారు. వారు దైవాన్ని ద్వేషించలేదు, కానీ దైవం పేరిట జరిగే అన్యాయాన్ని ఎదిరించారు. మన ఉపనిషత్తులు ఎప్పుడో చాటి చెప్పాయి "ప్రజ్ఞానం బ్రహ్మ" అని. అంటే, జ్ఞానమే పరమాత్మ. కేవలం మంత్రాలు చదవడం వల్లనో, దండాలు పెట్టడం వల్లనో జ్ఞానం రాదు. బుద్ధిని వికసింపజేసుకున్నప్పుడే పరమాత్మ తత్త్వం అర్థమవుతుంది. శ్రీమద్భగవద్గీతలో కృష్ణుడు అర్జునుడికి యుద్ధం చేయమని నేరుగా చెప్పలేదు. ముందుగా అతనికి జ్ఞానోదయం కలిగించాడు. జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః" అంటే జ్ఞానం ద్వారా మాత్రమే అజ్ఞానం నశిస్తుందని బోధించాడు. బుద్ధిని పదును పెట్టడమే గీతాసారం. స్వామి వివేకానంద కూడా ఇదే విషయాన్ని నొక్కి చెప్పారు. మతం అనేది ఆలోచించకుండా అనుసరించేది కాదు. అది అనుభవించి, అర్థం చేసుకోవలసిన సత్యం అన్నారాయన. ఆయన బోధించిన జ్ఞాన, భక్తి, కర్మ, రాజయోగాలలో జ్ఞానానికి అత్యున్నత పీఠం వేశారు. బుద్ధి అనే దీపం వెలిగినప్పుడే భక్తి అనే దారి సుగమమవుతుంది. బుద్ధి అంటే కేవలం డిగ్రీలు సంపాదించడం లేదా పుస్తకాలు చదవడం కాదు. ఎదుట ఉన్న విషయం నిజమా? అబద్ధమా? ఇది సమాజానికి



మేలు చేస్తుందా? లేదా హాని కలిగిస్తుందా? అని ప్రశ్నించగలిగే సత్తా ఉండటమే అసలైన బుద్ధి. ఒక చీకటి గదిలో చిన్న దీపాన్ని వెలిగిస్తే చీకటి ఎలా మాయమవుతుందో, భక్తి అనే భావానికి వివేకం తోడైతే మూఢనమ్మకాల చీకటి అలా పారిపోతుంది.

కళ్ళు తెరుచుకుని నడిచేవాడు గోతిలో పడడు. కానీ, కళ్ళు మూసుకుని 'దేవుడే చూసుకుంటాడు' అని నడిచేవాడు అగాధంలో పడటం ఖాయం. భక్తి అనేది ఒక ప్రయాణం అయితే, బుద్ధి అనేది ఆ ప్రయాణంలో మనకు దారి చూపే కళ్ళు. కళ్ళు లేని ప్రయాణం ప్రమాదకరం. చరిత్ర పుటలను తిరగేస్తే, అంధ భక్తి కారణంగా జరిగిన మారణకాండలు గుండెలను పిండేస్తాయి. మధ్యయుగంలో యూరప్‌లో 'ఇన్క్విజిషన్' పేరిట చర్చికి వ్యతిరేకంగా మాట్లాడిన వేలాది మందిని చిత్రహింసలు పెట్టి చంపారు. ఇస్లాం పేరుతో నేటికీ కొందరు తీవ్రవాదులు రక్తపాతం సృష్టిస్తున్నారు. మన దేశంలో కుల వ్యవస్థను 'ధర్మం' అని నమ్మి కోట్లాది మంది ఆత్మగౌరవాన్ని కాలరాశారు. ఇవన్నీ ఎందుకు జరిగాయి? ఆలోచించే శక్తిని పక్కన పెట్టి, ఎవరో చెప్పిన అబద్ధాలను భక్తిగా భ్రమించడం వల్లనే! అదే సమయంలో, వివేకంతో కూడిన భక్తి సమాజానికి వెలుగునిచ్చింది. గౌతమ బుద్ధుడు దేనినీ నమ్మొద్దు, నిరూపించుకో. అని చెప్పాడు. అన్నమాచార్యులు వేంకటేశ్వరుడిని సేవిస్తూనే బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే అంటూ కుల వివక్షను ఎండగట్టారు. వారి భక్తిలో సామాజిక స్పృహ ఉంది, శాస్త్రీయ దృక్పథం ఉంది. ప్రస్తుత సమాజంలో అడుగుకో బాబా, గడపకో అమ్మ పుట్టుకొస్తున్నారు. వారి ఆశ్రమాల్లో జరిగే వికృత చేష్టలు, లైంగిక వేధింపులు, ఆర్థిక మోసాలు చూస్తుంటే భయం వేస్తుంది. ఆశారాం బాపు నుండి నిత్యానంద వరకు ఎందరో కటకటాల వెనక్కి వెళ్లినా, ఇంకా వారిని గుడ్డిగా ఆరాధించే భక్తులు ఉన్నారంటే అది మన విద్యావ్యవస్థ వైఫల్యమే. ప్రజలలో భావోద్వేగాలు ఎక్కువై, ఆలోచనా శక్తి తగ్గిపోతోంది. గురువును ప్రశ్నించడం పాపం అనే భయం వారిని బానిసలుగా మారుస్తోంది. మిత్రులారా, గుర్తుంచుకోండి! ప్రతి మత గురువును ప్రశ్నించే హక్కు మీకు ఉంది. వారి బోధనలు నైతికంగా ఉన్నాయా? వారి ప్రవర్తన సమాజ హితంగా ఉందా? అని ఆలోచించాలి. ప్రశ్నించడం పాపం కాదు, అది మీ మేధస్సుకు ఇచ్చే గౌరవం. నిజమైన ఆధ్యాత్మికత అనేది బుద్ధికి, భక్తికి మధ్య జరిగే యుద్ధం కాదు; అది ఆ రెండింటి సుందర సంగమం. సముద్రానికి రెండు ఒడ్డులు ఉన్నట్లు, మానవ వికాసానికి ఇవి రెండు కావాలి. బుద్ధి లేని భక్తి ఒక అంధుడు అగాధం వైపు వేగంగా పరిగెత్తడం లాంటిది. భక్తి లేని బుద్ధి కాంతి లేని కళ్ళు లాంటిది. అన్నీ కనిపిస్తాయి కానీ ఏ అనుభూతీ ఉండదు. అందుకే ప్రేమతో నమ్మండి, కానీ వివేకంతో పరీక్షించండి. రమణ మహర్షి చెప్పినట్లు, ఆత్మ విచారణే అత్యున్నత భక్తి. మనల్ని మనం ప్రశ్నించుకోవడమే నిజమైన సాధన. సత్యాన్ని అన్వేషించడమే అసలైన ఆరాధన. మనం మన పిల్లలకు దేవుని పట్ల నమ్మకాన్ని నేర్పడం మంచిదే, కానీ అంతకంటే ముఖ్యంగా ప్రశ్నించే తత్వాన్ని నేర్పాలి. ఎందుకు? ఏమిటి? ఎలా? అని అడిగే బుద్ధిని పెంపొందించాలి. మత గ్రంథాలను చదివించాలి, కానీ వాటిని గుడ్డిగా కాకుండా, వివేకంతో అన్వయించుకోవడం నేర్పాలి. బుద్ధి లేని భక్తి అంధత్వం అనేది ఒక కఠినమైన వాస్తవం. మన పూర్వీకులు కోరుకున్నట్లు "తమసో మా జ్యోతిర్గమయ" అంటే అంధకారం నుండి వెలుగు వైపు మన ప్రయాణం సాగాలి. ఆ వెలుగే మన బుద్ధి. ఆ నడక పేరే అసలైన భక్తి. మూఢ నమ్మకాల సంకెళ్లను తెంచుకుని, వివేకంతో అడుగులు వేద్దాం. అప్పుడే ఈ సమాజం, ఈ దేశం నిజమైన ఆధ్యాత్మిక ఉన్నతిని సాధిస్తుంది. జయ్ జ్ఞానం! జయ్ వివేకం! జయ్ నిజమైన భక్తి!



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

## గతేడాది కూడా నీట్ ప్రశ్నాపత్రం లీక్

**లీక్ పేపర్లతో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు**

**టెన్త్, ఇంటర్‌లో అత్తెసరు మార్కులు వచ్చినా నీట్‌లో హవా**

**గతేడాది లీక్ ఆనవాళ్లపై దృష్టి సారించిన సిబిఐ**

న్యూఢిల్లీ: నీట్ 2026 పరీక్ష పత్రం లీకేజీపై దృష్టిపెట్టిన అధికారులకు గతేడాది లీక్ ఆనవాళ్లు బయట పడుతున్నాయి. కీలక నిందితుడైన వికాస్ బివాల్ గతేడాది యశ్ యాదవ్ నుంచి నీట్ ప్రశ్నపత్రం కొనుగోలు చేసినట్లు సీబీఐ అనుమానిస్తుంది. దీంతో ఈ యేడాది కూడా యశ్ నుంచే వికాస్ ఈ పేపర్‌ను కొన్నాడు. ఈ వ్యవహారంలో యశ్ తండ్రి మంగిలాల్ బివాల్, అంకుల్ దినేశ్ బివాల్ హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వికాస్ అతడి సోదరిలు ప్రగతి, కజిన్స్ సానియా, గుంజన్, పలాక్‌లు కూడా గతేడాది వైద్యవిద్య సీట్లు పొందారు. వీరంతా కూడా లీకైన పేపర్ సాయంతోనే సీట్లు సాధించినట్లు తెలుస్తోంది. వికాస్‌కు పదో తరగతిలో 63శాతం, 12వ తరగతిలో 55శాతం మార్కులు వచ్చాయి. ఇక 2024లో నీట్ పరీక్ష రాస్తే కేవలం 720కి గాను 240తో సరిపెట్టుకొన్నాడు. సికార్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో 46 పరీక్షలు రాస్తే సగటున 384 మార్కులు వచ్చాయి. కానీ, 2025లో మాత్రం 85.11 పర్సెంటైల్‌తో గవర్నమెంట్ కాలేజీలో సీటు సాధించడం విశేషం. ఇక ఆయన సోదరి ప్రగతి 10వ తరగతిలో 69శాతం , 12వ తరగతిలో 91శాతం మార్కులు వచ్చాయి. 2024 నీట్‌లో 720కి 355 మార్కులే వచ్చాయి. కానీ, సికార్‌లోని కోచింగ్ సెంటర్‌లో 50 నమూనా పరీక్షలు రాస్తే మార్కులు ఏనాడు 320–342 దాటలేదు.

## ఆదివారం నుంచి అధిక జేష్టమాసం

### పెళ్లిళ్లు తదితరాలకు నెలపాటు విరామం

### శుభముహూర్తాలకు బ్రేక వేళ తగ్గిన బంగారం ధరలు

అధిక జేష్టమాసంతో శుభముహూర్తాలు అయిపోయాయి. మరో నెలరోజుల తరవాతనే పెళ్లి తదితర ముహూర్తాలకు ఛాన్స్ ఉంది. గురువారం నుంచి అన్నిరకాల శుభ ముహూర్తాలు ముగిసాయని పండితులు చెబుతున్నారు. ఫిబ్రవరి నుంచి మే 13 వరకూ తెలుగు లోగిళ్ళను వివిధ రకాల శుభకార్యాలతో కళకళలాడాయి. ఇప్పుడు ముహూర్తాలు నెల రోజల పైబడి లేవని సెలవిచ్చారు. ఆదివారం నుంచి అధిక జ్యేష్ట మాసం రానుండడంతో జూన్ 20 వరకూ మంచి రోజులు లేవని పురోహితులు చెపుతున్నారు. జూన్‌లో చివరి 8 రోజులు మంచి ముహూర్తాలున్నాయని పండితులు వివరిస్తున్నారు. జూలైలో మరో నాలుగు రోజులు మాత్రమే ముహూర్తాలున్నాయిని ఆ తరువాత చతుర్మాసం తదితర కారణాలతో ఆగస్టులో 11 రోజులు, సెప్టెంబరులో 4, అక్టోబరులో మరో 4 రోజులు మాత్రం ముహూర్తాలున్నా చతుర్మాసం అడ్డొస్తోందని పురోహితులు అంటున్నారు. ఆ తరువాత నవంబరులో కార్తీక మాసం కారణంగా 11 రోజులు, డిసెంబరులో మరో 14 రోజుల్లో కూడా అనువైన ముహూర్తాలున్నాయంటున్నారు. దీంతో పెళ్లిళ్లపై ఆధారపడ్డ వారు ,ఇతర కార్యక్రమాలపై ఆధారపడ్డ వారికి ఖాళీగా ఉండాల్సిన ఆగత్యం ఏర్పడింది. కారణం ఏదైనా భారత్‌లో బంగారం ధరల ర్యాలీకి బ్రేక్ పడినట్టు కనిపిస్తోంది. అంతర్జాతీయ అనిశ్చితులు, కేంద్రం దిగుమతి సుంకాల పెంపు నేపథ్యంలో బంగారం, వెండి ధరల్లో భారీ కోత కనిపించింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శుక్రవారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,60,090కు పడిపోయింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ధరలో ఏకంగా రూ.2,240ల మేర కోత పడింది. 22 క్యారెట్ల పసిడి ధర కూడా రూ.1,46,750కు చేరుకుంది. నిన్నటితో పోలిస్తే ధర రూ.2,050ల మేర తగ్గింది. నగరంలో వెండి ధరలో కూడా రూ.10 వేల కోత పడింది. ప్రస్తుతం కిలో వెండి రూ.3.05 లక్షల వద్ద ట్రేడవుతోంది ఇతర ప్రధాన నగరాల విషయానికి వస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,63,390గా ఉంది. ఢిల్లీలో రూ.1,60,240గా, ముంబైలో రూ.1,60,090 వద్ద కొనసాగుతోంది. చెన్నైలో 22 క్యారెట్ల ఆర్నమెంటల్ పసిడి ధర రూ.1,49,500గా, ఢిల్లీలో రూ.1,46,900గా, ముంబైలో రూ.1,46,750గా ఉంది. చెన్నై సహా పలు నగరాల్లో వెండి దర రూ.3.05 లక్షల వద్ద ట్రేడవుతోంది. నిన్నటితో పోలిస్తే దేశంలో కిలో వెండి ధర రూ.10 వేల మేర తగ్గింది.

# తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ప్యానెల్-2 యువజన విభాగం నియామకం




**రాష్ట్ర యువత అధ్యక్షుడు: ఆడికె సంతోష్ కురుమ**

**రాష్ట్ర యువత ఉపాధ్యక్షుడు: ఎన్. రమేష్ కురుమ**

**జంట నగరాల (హైదరాబాద్ - సికింద్రాబాద్) ఉపాధ్యక్షుడు: పూజారి ప్రవీణ్ కురుమ**

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం (రిజిస్టర్ నెంబర్: 15/1951) ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం సోమాజిగూడ గూడ ప్రెస్ క్లబ్ లో ప్యానల్ -యువజన విభాగం నూతన కమిటీని ప్రకటించింది. సంఘం బలోపేతానికి, కురుమ సమాజ సంక్షేమానికి యువతరం పాత్ర అత్యంత కీలకమని భావిస్తూ ఈ కీలక నియామకాలు చేపట్టినట్లు ప్యానెల్-2 ముఖ్య నాయకులు వెల్లడించారు. నూతనంగా ఎన్నికైన ప్యానెల్-2 యువ నాయకులు ?రాష్ట్ర యువత అధ్యక్షుడు ఆడికె సంతోష్ కురుమ ?రాష్ట్ర యువత ఉపాధ్యక్షుడు ఎన్. రమేష్ కురుమ ?జంట నగరాల (హైదరాబాద్ - సికింద్రాబాద్) ఉపాధ్యక్షుడు పూజారి ప్రవీణ్ కురుమ ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా ప్యానెల్-2 ప్రతినిధులు మాట్లాడుతూ, కురుమ సమాజ హక్కుల సాధన కోసం మరియు క్షేత్రస్థాయిలో సంఘాన్ని బలోపేతం చేసేందుకు నూతన యువ కమిటీ శ్రమిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో యువతను పెద్ద ఎత్తున ఏకం చేసి, సమాజ అభివృద్ధికి సరికొత్త కార్యాచరణతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.?తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన ప్యానెల్-2 నాయకత్వానికి నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకాల పట్ల కురుమ సంఘం ప్రతినిధులు, సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ నూతన యువ నాయకులకు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు అందజేశారు.



## అక్రమంగా మూగజీవాలను తరలిస్తున్న వారిపై కేసు నమోదు

**మండల ఎస్సై కూచిపూడి జగదీష్ పట్టివేత**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తిరుమలాయపాలెం మండల సమీపంలోని తెల్లవారుజామున శుక్రవారం నాలుగున్నర సమయంలో అక్రమంగా పశువులను బంధించి ఒరిస్సా నుంచి హైదరాబాదుకు తరలిస్తున్న లారీ నెంబర్ TS07UG2559 లారీ డ్రైవర్ షేక్ జమీల్ ను మరియు తుని నుండి జనగాం కు పశువులను బంధించి తరలిస్తున్న టాటా ఎంట్రా ట్రాలీ నెంబర్ AP39 WC 4501 ట్రాలీ డ్రైవర్ కోన ముస్లి తిరుమలాయపాలెం ఎస్సై మరియు మండల పోలీస్ కానిస్టేబుల్ సిబ్బంది సుబ్లేడ్ క్రాస్ రోడ్డు వద్ద పట్టుకోవడం జరిగింది. పట్టుబడిన లారీను లారీ డ్రైవర్ను టాటా ఎంట్రా డ్రైవర్ను టాటా ఏంట్రా వెహికల్ను అదుపులోకి తీసుకొని విచారించగా లారీలోని పశువుల ట్రాన్స్పోర్టర్ శేఖర్ గౌడ్ అని మరియు టాటా ఎంట్ర వెహికల్ లోనీ పశువుల ట్రాన్స్పోర్టర్ రాంప్రసాద్ అని తెలియపరిచినారు.లారీలో 40 పశువులు మరియు ట్రాలీలో పది పశువులు ఉన్నాయి. లారీలోని ఐదు పశువులు చనిపోగా తిరుమలాయపాలెం వెటర్నరీ డాక్టర్ అనుష పంచనామా నిర్వహించారు. ఇట్టి విషయంలో వారిపై కేసు నమోదు చేయడం జరిగిందని మండల ఎస్సై కూచిపూడి జగదీష్ కేసు నమోదు చేసాడు

## జనగణనతోనే సంక్షేమ పథకాల రూపకల్పన: మాజీ కౌన్సిలర్ రామకృష్ణ రెడ్డి

**కేపీఆర్ కాలనీలో వివరాల సేకరణ ప్రక్రియ ప్రారంభం**

**ఎన్యూమరేటర్ల పనితీరును పరిశీలించిన గండిపేట: ఎంఈఓ నిరంజన్**

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ )** దేశ సమగ్ర అభివృద్ధికి పునాది అయిన జనగణన కార్యక్రమంలో ప్రతి కుటుంబం చురుకుగా పాల్గొని పూర్తి సహకారం అందించాలని మణికొండ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రామకృష్ణ రెడ్డి కోరారు. జనగణన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మణికొండ కేపీఆర్ కాలనీలోని మణికొండ మాజీ సర్పంచ్ కొండకళ్ల లక్ష్మమ్మ -- రామకృష్ణ రెడ్డి నివాసంలో ఎన్యూమరేటర్లు వారి కుటుంబ వివరాలను సేకరించారు. ఈ ప్రక్రియ కొనసాగుతుండగా గండిపేట మండల విద్యా అధికారి నిరంజన్ అక్కడికి చేరుకుని, ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న వివరాల సేకరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమం ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా సాగేందుకు ఎన్యూమరేటర్లకు పలు సూచనలు, మార్గదర్శకాలు అందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ, జనగణన ద్వారా ప్రభుత్వానికి ప్రజల నిజమైన అవసరాలు, జనాభా గణాంకాలు స్పష్టంగా తెలుస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ కార్యక్రమాల సమర్థవంతమైన అమలులో జనగణన అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రతి కుటుంబం తమ సరైన




వివరాలను నమోదు చేయించుకోవడం ద్వారానే ప్రభుత్వ పథకాల రూపకల్పనకు సరైన తోడ్పాటు అందించి నట్లవుతుందని ఆయన స్పష్టం చేశారు.?ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు ఇమ్రాన్ అలీ, రజిని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు...

## నెరేళ్ల చెరువు సుందరీకరణ పనులను పరిశీలించిన పి ఏ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ..



**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్:** కొండాపూర్ డివిజన్ పరిధిలోని కొత్తగూడా విలేజ్‌లో ఉన్న నెరేళ్ల చెరువులో జరుగుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులను పి ఏ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డి సి బాలకృష్ణ ,మాజీ కార్పొరేటర్లు హమీద్ పటేల్,నార్నె శ్రీనివాసరావు , రవీందర్ ముదిరాజ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా పి ఏ సి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ, నెరేళ్ల చెరువును పర్యావరణ హితంగా, ప్రజలకు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. చుట్టుపక్కల కాలనీల నుంచి వచ్చే మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యేక యూ జి డి మళ్లింపు పైప్‌లైన్ నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు. చెరువు కలుషితం కాకుండా సంరక్షిస్తూ, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు.చెరువు కట్ట పునరుద్ధరణ, అలుగు మరమ్మత్తులు, కట్ట బలోపేతం, ఫెన్సింగ్ ఏర్పాటు, వాకింగ్ ట్రాక్ నిర్మాణం వంటి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపడతామని తెలిపారు. పనుల్లో ఎక్కడా రాజీపడకుండా, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.ఇప్పటికే చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించి శుభ్రపరిచినట్లు గుర్తుచేస్తూ, స్థానిక ప్రజల సమస్యలను పరిగణలోకి తీసుకుని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దోమల సమస్య, అనారోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని చెరువును పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.అదేవిధంగా చెరువులను కబ్జాలకు గురికాకుండా పరిరక్షించడం, సుందరీకరణ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. తామర పువ్వుల పెంపకం, పచ్చదనం, వాకింగ్ ట్రాక్‌లతో ప్రజలకు చక్కటి ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను దశలవారీగా అభివృద్ధి చేస్తామని పి ఏ సి చైర్మన్ గాంధీ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595




## తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘ ఆధ్వర్యంలో ఎంపీడీవో షేక్ శీలార్ సాహెబ్ కు వినతి పత్రం

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తిరుమలాయపాలెం మండల ఎంపీడీవో షేక్ శీలార్ సాహెబ్ కు వినతిపత్రం అందజేశారు అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం పాలేరు డివిజన్ కమిటీ సభ్యులు దాసరి మహేందర్ నేరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుందాం కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం దొడ్డి దారి నా కొత్తగా తీసుకువచ్చిన వివి రామ్ జి బిల్లును వెంటనే రద్దు చేయాలని పెండింగ్ వేతనాలు వెంటనే రిలీజ్ చేయాలని పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని 200 రోజులకు పని దినాన్ని కల్పించాలని రోజుకు 600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు లేనియెడల భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు డిమాండ్ చేశారు ఈ యొక్క కార్యక్రమంలో పశుపొంగు వీరన్న గుండుమల్ల ఉపేందర్ తుళ్లూరు నాగేశ్వరావు కొమ్ము నాగేశ్వరావు పోలేపొంగు ముత్తయ్య సిపిఎం పార్టీ శ్రేణులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## మెడికల్ షాపుల బంద్‌కు కాటేదాన్ వర్తకుల మద్దతు: సన్నాహక సమావేశం విజయం



**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** ఈనెల 20వ తేదీ బుధవారం నాడు దేశవ్యాప్తంగా నిర్వహించతలపెట్టిన 'ఆలిండియా మెడికల్ షాప్ బంద్' కార్యక్రమానికి కాటేదాన్ ఏరియా ఔషధ వ్యాపారులు పూర్తి మద్దతు ప్రకటించారు. బంద్‌ను విజయవంతం చేసేలా స్థానిక మెడికల్ షాపుల నిర్వాహకులతో కాటేదాన్ పరిధిలో ఒక ముఖ్యమైన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఫార్మసీ రంగంలో ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం, కేంద్ర ప్రభుత్వ కొన్ని విధానాలకు వ్యతిరేకంగా ఆలిండియా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాటేదాన్ ఏరియాలోని ఔషధ వ్యాపారు లందరూ బుధవారం నాడు స్వచ్ఛందంగా షాపులను మూసివేసి నిరసనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అత్యవసర వైద్య సేవల నిమిత్తం మినహా మిగిలిన అన్ని రకాల మందుల దుకాణాలు మూతపడతాయని పేర్కొన్నారు.?ఈ సన్నాహక సమావేశంలో స్థానిక ఫార్మసీ నిర్వాహకులు, అసోసియేషన్ ప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో మెడికల్ షాప్ యజమానులు పాల్గొన్నారు.

## పెంచిన ఇంధన ధరలకు కేంద్ర ప్రభుత్వంపై నిరసన

**ఎల్బీనగర్ చౌరస్తాలో నిరసన తెలియజేసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**



ఎల్బీనగర్ మే 15, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:డీజిల్, పెట్రోల్ ధరలను పెంచుతూ ప్రజలపై భారం మోపుతున్న కేంద్ర ప్రభుత్వానికి నిరసనగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్.బి.నగర్ చౌరస్తాలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అడ్డు, అదుపు లేకుండా పెంచుతున్న పెట్రోల్, డీజిల్ ధరలకు వ్యతిరేకంగా ప్రజల తరఫున ఈ నిరసన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. పెరుగుతున్న ఇంధన ధరల వల్ల సామాన్య ప్రజల జీవనం తీవ్రంగా దెబ్బతింటోందని, కేంద్ర ప్రభుత్వం ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు.ఇలాంటి అన్యాయ ధరల పెంపులను అడ్డుకునేందుకు ప్రజలను చైతన్యవంతం చేస్తూ భవిష్యత్తులో కూడా ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు,మాజీ చైర్మన్లు, నియోజకవర్గ సీనియర్ నాయకులు, పలు డివిజన్ల అధ్యక్షులు,మహిళ అధ్యక్షురాళ్లు, ఉద్యమకారులు, యువ నాయకులు, మహిళా నాయకులు, వివిధ విభాగాల అనుబంధ కమిటీ సభ్యులు, కార్యకర్తలు మరియు పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నిరుద్యోగులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి: అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు





**చౌటుప్పల్,మే15, క్రైమ్ మిర్రర్ :** నిరుద్యోగులు గ్రంథాలయంలోని కాంపిటేటివ్ పుస్తకాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని స్థానిక సంస్థల ఆత్మ కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. శుక్రవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని గ్రంథాలయాన్ని గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరిం చుకొని అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు ఆర్డీవో వి శేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మోగదాల పావని రమేష్ గౌడ్ లతో కలిసి సందర్శించారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 11 నుండి 17 వరకు జరిగే విద్యా వారోత్సవాలను ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు గ్రంథాలయంలో పుస్తకాలను సద్వినియోగం చేసుకొని,ఉన్నత స్థాయి ఉద్యోగాలు సంపాదించుకోవాలని అయన ఆకాంక్షించారు. అలాగే పట్టణంలోని విద్యావంతులు ప్రతి ఒక్కరూ ప్రతిరోజు గ్రంథాలయంలోని పుస్తకాలను చదివి తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. అనంతరం గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన దేవలమ్మ నాగారం గ్రామానికి చెందిన కొనని వెంకటేశం, వై సూర్య, బీ.తరుణ్ కుమార్ లను అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వి శేఖర్ రెడ్డి , మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్, మున్సిపల్ చైర్ పర్సన్ ముగుదాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోసిక వినయ్ కుమార్, గ్రంథాలయ కార్యదర్శి ఎం సుధీర్ లు పాల్గొన్నారు.




# పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలి - వై విక్రమ్

**భారాలు వేయడమే ప్రధమ కర్తవ్యంగా పెట్టుకొన్న మోడీ - వై విక్రమ్**

**సిపిఎం ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మ దగ్ధం..**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** జనం ఓట్లు వేసి గెలిపిస్తే ఆ జనంపైనే ప్రతి రోజూ ధరలు వేస్తున్న మోడీ ప్రభుత్వానికి సిగ్గు వుండాలని సీపీఎం పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ విమర్శించారు శుక్రవారం ఎన్ ఎస్ టి రోడ్ పై పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దేశాన్ని నిస్సిగ్గుగా తాకట్టు పెట్టడం బిజెపి ప్రభుత్వానికే దక్కిందని విమర్శించారు. దేశభక్తి పేరుతో దేశ సంపదను, దేశ ప్రభుత్వ రంగాలను, లాభాల్లో వున్న పరిశ్రమలను అమ్మాలని మోడీ ప్రభుత్వం నిర్ణయం చేయడం పెద్ద దేశద్రోహం అని అన్నారు. ప్రతి రోజు పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలను పెంచడం అత్యంత దుర్మార్గం అని విమర్శించారు. తక్షణమే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజలపై భారాలు వేయడమే ప్రధమ కర్తవ్యంగా మోడీ ప్రభుత్వం పని పెట్టుకుంది అని విమర్శించారు. నాలుగు రాష్ట్రాల ఎన్నికలు కాగానే భారాలు వేశారని ఆరోపించారు. మోడీ ప్రభుత్వం వచ్చే నాటికి లీటరు ధర 60 రూపాయలు వుంది అని నేడు పెంచిన 3 రూపాయలు ధరతో ఖమ్మం నగరంలో ఒక లీటరు పెట్రోలు ధర 110 రూపాయలు పెరిగింది అని దుయ్యబట్టారు. రాబోయే కాలంలో పెట్రోల్ ధర లీటరు 200 రూపాయలు పెంచే వరుకు మోడీ నిద్ర పోదు అని ఎగతాళి చేశారు. వెంటనే ధరలు తగ్గించకపోతే ప్రజలు సరియైన టైం లో బుద్ధి చెప్పటం ఖాయం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొంగల తిరుపతిరావు భుక్యా శ్రీనువాసురావు నాగులు మీరా వజేనేపల్లి శ్రీనువాసురావు పి మోహన్ రావు ప్రవీణ్ రాజు బండారు యాకయ్య మెహరిన్నసా బేగం జె వెంకన్న బాబు భద్రం కూరపాటి శ్రీనువాసురావు బాగం అజితా తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు

**అక్రమాలు, అవినీతి కార్యకలాపాలపై సంచలన వివరాలు వెల్లడి**

**గండిపేట(క్రైం మిర్రర్):** తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అధికారులు మే 8 నుంచి శంషాబాద్ మండల తహసీల్దార్ ఉ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అలాగే జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో పలు అక్రమాలు, అవినీతి కార్యకలాపాలు వెలుగులోకి వచ్చినట్లు వెల్లడించారు. ఏసీబీ తనిఖీల్లో భాగంగా తహసీల్దార్ కే. రవీందర్ దత్ కార్ డాష్‌బోర్డ్‌లో లెక్కల్లో చూపని రూ.60 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జి. కృష్ణ వద్ద నుంచి రూ.29,650 నగదును స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల సమయంలో ఆ నగదును బయటకు విసిరేయడంతో పాటు ఒక ఫైల్‌ను టాయిలెట్ పైకప్పుపై దాచే ప్రయత్నం చేసినట్లు అధికారులు గుర్తించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ ఎస్. పృథ్వీరాజ్ వద్ద నుంచి రూ.10 వేల లెక్కల్లో లేని నగదు స్వాధీనం చేసుకున్నారు. కార్యాలయంలో వ్యక్తిగత నగదు రిజిస్టర్ నిర్వహించడం లేదని, మొత్తం 68 మీ సేవా దరఖాస్తులు నిర్దేశిత గడువు దాటినా పెండింగ్‌లో ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.తహసీల్దార్ కే. రవీందర్ దత్ తన అధికార పరిధిని మించి, ఉన్నతాధికారులకు తెలియకుండా కొన్ని ధృవపత్రాలు, లేఖలు జారీ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. కొన్ని సందర్భాల్లో ల్యాండ్ రిఫార్మ్స్ ట్రిబ్యునల్ అధికారాలను కూడా స్వయంగా వినియోగించినట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. శంషాబాద్, తొండుపల్లి, సాతంరాయి గ్రామాలకు చెందిన కొన్ని సర్వే నంబర్ల వ్యవహారాల్లో జారీ చేసిన ఉత్తర్వుల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు గుర్తించారు. ఈ చర్యల వల్ల కొంతమంది ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూరడమే కాకుండా ప్రభుత్వ ఆస్తులకు, ప్రభుత్వ ప్రతిష్టకు నష్టం కలిగినట్లు వెల్లడించారు.మొత్తంగా శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఆకస్మిక తనిఖీల్లో విధుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం, అక్రమాలు, అధికార దుర్వినియోగం జరిగినట్లు ఏసీబీ ప్రాథమికంగా నిర్ధారించినట్లు పేర్కొంది.



ఇంధన పొదుపు పై ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు బిజెపి రాష్ట్ర నేత కొలను శంకర్ రెడ్డి తన విద్యుత్ వాహనంలో ప్రయాణం కొనసాగించారు (బాలాపూర్ క్రైమ్ మిర్రర్)

# నీరు జీవం-- నీరు లేకపోతే జీవితం దుర్భరం

## ప్రజల నీటి కష్టాలను పట్టించుకోవడంలో అధికారులు విఫలం

**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రజల నీటి కష్టాలను పట్టించుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని మణికొండ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ అన్నారు. శుక్రవారం మణికొండలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించతలపెట్టిన వాక్ ఫర వాటర్ కార్యక్రమంపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు జీవం - నీరు లేకపోతే జీవితం దుర్భరం అన్నారు. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా, పక్కనే జంట జలాశయాలు ఉన్నప్పటికీ మణికొండ, నెక్నంపూర్ ప్రాంత ప్రజలు తీవ్రమైన తాగునీటి సంక్షోభంతో అల్లాడు తున్నారు. ప్రజల ఇబ్బందులు వర్ణనా తీతంగా మారాయన్నారు. గత సంవత్సరం ఫిబ్రవరి 25 న జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా డిజిటల్ విధానంలో ప్రారంభించ బడిన నీటి రిజర్వాయర్లు ఇప్పటికీ ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటు లోకి రాకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. 2.5 ఎంఎల్డీ సామర్థ్యం గల ఆలకాపూర్ స్పోర్ట్స్ పార్క్ నీటి రిజర్వాయర్, 1 ఎంఎల్డీ సామర్థ్యం గల ఎల్ఐసీ కాలనీ నీటి రిజర్వాయర్, 1 ఎంఎల్డీ సామర్థ్యం గల కృష్ణారెడ్డి ఎన్‌క్లేవ్ నీటి రిజర్వాయర్, ప్రాజెక్టులు ప్రారంభమై చాలా కాలం గడిచినా ప్రజలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూరక పోవడంపై సంబంధిత అధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ అంశంపై సమగ్ర దర్యాప్తు జరిపి, ఆలస్యానికి కారణమైన వారిపై - వారు ప్రస్తుతం విధుల్లో ఉన్నా, బదిలీ అయినా, పదవీ విరమణ పొందినా - చట్టపరమైన



చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం భూగర్భ జలాలు దాదాపు 2000 అడుగుల లోతుకు పడిపోవడం అత్యంత ఆందోళనకరం. నీరు ఉంటేనే భవిష్యత్తు ఉంటుంది అనే సత్యాన్ని గుర్తుంచు కొని ప్రతి నీటి బొట్టును సంరక్షించడం మనందరి బాధ్యతన్నారు. ప్రతి ఇంటిలో రైన్ వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి, వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి మళ్లించాలి, ఆర్ఓ వృథా నీటిని మొక్కలకు, పరిశుభ్రత అవసరాలకు వినియోగించాలి, లీకేజీలు ఉన్న పైపులు, ట్యాపులను వెంటనే మరమ్మతు చేయాలి, స్నానాలు, వాహనాల శుభ్రపరిచే సమయంలో నీటి వృథాను తగ్గించాలన్నారు. నీరు మన రాజ్యాంగం కల్పించిన జీవన హక్కులో భాగం. రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యంగా ముందుకు వచ్చి తగినంత పైప్‌లైన్ తాగునీటి సరఫరా కోసం తమ స్వరాన్ని వినిపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ నేపథ్యంలో పిల్లల భవిష్యత్తు దృష్ట్యా, మే 17 ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించ బడనున్న "వాక్ ఫర్ వాటర్" కార్యక్రమం నెక్నంపూర్ చింతచెట్టు వద్ద నడక సాగిస్తూ పుప్పాలగూడ పోస్టాఫీస్ మీదుగా మణికొండ మర్రిచెట్టు జలమండలి కార్యాలయం వరకూ కొనసాగుతుందన్నారు. ప్రజా ప్రయోగ నీటి హక్కు కోసం జరుగుతున్న శాంతియుత నడకలో మహిళలు, యువత, వృద్ధులు, ప్రతి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయ వలసిందిగా వినమ్ర విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రజల సమస్యలను విస్తృత స్థాయిలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల గొంతుకగా నిలవన్నారు. సమావేశంలో కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, బొమ్ము ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, రామ సుబ్బారెడ్డి, యాలాల కిరణ్, జై రామ్, భాను చందర్, బొడ్డు శ్రీధర్, రాజేంద్ర ప్రసాద్, మహమ్మద్ ఆరిఫ్, సుమనళిని, రమణ మూర్తి, బాబు రావు, బిందు, దేవి ప్రియ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 9 లోపు సెన్సస్ హౌస్ లిస్టింగ్ పూర్తి చేయాలి: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్

**శంషాబాద్ సర్కిల్‌లో జనగణన సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్**

**ఒక్క ఇల్లు కూడా మిస్ కాకుండా వివరాలు నమోదు చేయాలని ఆదేశం**

**గండిపేట : ( క్రైమ్ మిర్రర్ ):** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో కొనసాగుతున్న సెన్సస్ హౌస్ లిస్టింగ్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. శంషాబాద్ సర్కిల్-18 పరిధిలోని 118వ డివిజన్‌లో శరవేగంగా జరుగుతున్న జనగణన ఎన్యూమరేషన్ సర్వేను అడిషనల్ కమిషనర్ కె. చంద్రకళతో కలిసి ఆయన శుక్రవారం క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటి వివరాల సేకరణ, హౌస్ లిస్టింగ్ ప్రక్రియ, డేటా నమోదు విధానాలను కమిషనర్ నిశితంగా పరిశీలించి.. ఎన్యూమరేటర్లు, సూపర్వైజింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జూన్ 9, 2026 లోపు హౌస్ లిస్టింగ్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని ఫీల్డ్ సిబ్బందిని ఆదేశించారు. నగర పరిధిలో ఏ ఒక్క ఇల్లూ మిస్ కాకుండా, ప్రతి ఒక్కరి వివరాలు ఖచ్చితత్వంతో నమోదు కావాలని స్పష్టం చేశారు. జనగణన కార్యక్రమం అత్యంత ప్రాధాన్యత



కలిగినదైనందున.. డిప్యూటీ కమిషనర్లు సమన్వయంతో వ్యవహరించి సర్వేను విజయవంతం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పనులు మరింత వేగవంతం చేసేందుకు అవసరమైతే బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ల సేవలను కూడా వినియోగిం చుకోవాలని దిశానిర్దేశం చేశారు. దేశ భవిష్యత్తు ప్రణాళికలకు కీలకమైన జనగణన సర్వేకు ప్రజలంతా పూర్తిస్థాయిలో సహకరించి, ఎన్యూమరేటర్లు అడిగే వివరాలను సరైన రీతిలో అందించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో శంషాబాద్ జోనల్ కమిషనర్ కె. చంద్రకళ, డిప్యూటీ కమిషనర్ బి. సుమన్ రావు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రంగారెడ్డి జిల్లా, మండలవారీగా, షాద్నగర్, కేశంపేట, కడ్తాల్, కందుకూరు, కొత్తూరు, తలకొండపల్లి అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈక్రింది నెంబరుకు సంప్రదించగలరు.
Email ID: crimemirrorts@gmail.com
9393 44 6188

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శనివారం 16-5-2026



# కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు
# బండి సాయి భగీరథ ను వెంటనే అరెస్టు చేయాలి

## మంత్రి పదవి నుండి బండి సంజయ్ ను బర్త్ ఆఫ్ చేయాలి..దిష్టిబొమ్మ దగ్ధం




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** మైనర్ బాలిక కు బలవంతంగా మద్యం తాగిపించి అత్యాచారం చేశాడని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ పై హైదరాబాద్ లోని బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో ఈనెల 8వ తేదీన పోక్సో కేసు నమోదు అయింది. ఈ కేసు నమోదయి ఐదు రోజులు కావస్తున్న నేటికీ పోలీసులు ఇప్పటివరకు బండి భగీరథ పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం అని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ శివమణి టి యు సి ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామయ్య పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ అన్నారుఈ రోజు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర హోమ్ శాఖ మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ముందు దగ్ధం చేయడం జరిగింది అనంతరం శిరోమణి జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామయ్య పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ పాల్గొని మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానులే అని చెప్పే బీజేపీ ప్రభుత్వం,చట్టం ప్రకారం ఎందుకు అరెస్ట్ చేయడం లేదని, పోక్సో కేసు నమోదైతే వెంటనే అమ్మాయి వాయిస్ ను జడ్జి ముందు రికార్డు చేయాలని, నేరారోపణ ఎదుర్కొంటున్న నిందితుడిని వెంటనే అరెస్టు చేసి విచారించాలని నిబంధనలు ఉన్నా పోలీసులు అటువంటి చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుంది అని ధర్మం కోసం దేశం కోసం అరెస్ట్ కాకుండా ఆపుతున్నారా అని అన్నారు. గతంలో కూడా బండి సాయి భగీరథ చదువుకుంటున్న కాలేజీలో విద్యార్థుల్ని ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ చేశాడని భౌతిక దాడులకు పాల్పడ్డాడని పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. అటువంటి ఘటనకు సంబంధించిన వీడియోలు ఫోటోలు సాక్షధారలుగా పెద్ద ఎత్తున వచ్చాయి. ఇప్పుడు మైనర్ బాలికను హత్యాచారం చేశాడని కేసు నమోదు అయింది.ఈ కేసు నుండి తప్పించుకోవడం కోసం బండి సాయిభగీరథ కరీంనగర్ లో సదరు బాలికపై హనీ ట్రాప్ చేసిందని కేసు పెట్టాడు. ఆరోపణలను చట్టం ముందు ధైర్యంగా ఎదుర్కోవడం చేతకాక ఇలాంటి కౌంటర్ కేసులు పెట్టడం దుర్మార్గం బండి సంజయ్ అతని కుమారుడు భగీరథ తన ఆర్థిక, రాజకీయ, అంగ బలాన్ని ఉపయోగించి ఈ కేసును ఎలా అయినా మాఫీ చేయాలని తీవ్రమైన ప్రయత్నం చేస్తున్నారు. సాక్షాత్తు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ తన కుమారుడిపై మైనర్ బాలికపై అత్యాచార ఆరోపణలు వస్తే స్వచ్ఛందంగా ఆ పదవికి రాజీనామా చేయాల్సింది పోయి అదొక రాజకీయ కుట్ర అని ప్రకటించడం తన బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తుంది. బిల్కిస్ భానో అత్యాచార నిందితులను విడుదల చేయడానికి కేంద్ర ప్రభుత్వం సహకరించింది. వారు విడుదలయ్యాక బిజెపి నాయకులు సన్మానాలు కూడా చేశారు. మహిళలపై బాలికలపై అత్యాచారాలు చేసిన ఆశారాంబాపు దేరాబాబా లాంటి అనేకమంది అత్యాచార నిందితులకు సంవత్సరాల తరబడి పెరోల్ ఇచ్చి కాపాడుతున్నారు. బిజెపి ప్రజా ప్రతినిధులు నాయకులపై ఇలాంటి ఆరోపణలు వస్తే కనీసం విచారణ కూడా చేయడం లేదు. ఇది బిజెపి పార్టీ చెప్పే "బేటి బచావో బేటి పడావో" అసలు నినాదాన్ని తేటతెల్లం చేస్తుంది.రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ యంత్రాంగం ఈ ఘటనపై వెంటనే స్పందించి అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్న సాయి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నాము. బాధిత మైనర్ బాలికకు రాష్ట్ర ప్రభుత్వం భద్రత ఇవ్వాలని, కేసును నిష్పక్షపాతంగా విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నాము కేంద్ర ప్రభుత్వం హోంశాఖ సహాయ మంత్రి గా ఉన్న బండి సంజయ్ ను వెంటనే భర్త రఫ్ చేయాలి. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నామని వారు అన్నారు. ఈ దిష్టిబొమ్మ కార్యక్రమంలో టి యుసిఐ సాహాయ కార్యదర్శి ఆవుల అశోకు మరియు డి శ్రీను కే శ్రీనివాస్ పి ఓ డబ్ల్యు జిల్లా సహాయ కార్యదర్శి శోభ చైతన్య లక్ష్మి కవిత పిడిఎస్యుయు జిల్లా నాయకులు వినయ్ సురేష్ శ్రవణ్ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ టౌన్ కార్యదర్శి సత్తార్ తదితరులు పాల్గొన్నారు



## పుస్తకం చేతిలో ఉంటే భవిష్యత్తు బంగారమే : ఎమ్మెల్యే తొలకంటి ప్రకాష్ గౌడ్

### విద్యార్థులకు ప్రేరణనిచ్చిన లైబ్రరీ డే కార్యక్రమం



**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** విద్య అనేది కేవలం మార్కుల కోసం కాదు.. జీవితాన్ని మార్చే శక్తి అని చాటిచెప్పేలా విద్యా వారోత్సవాల్లో భాగంగా మణికొండ జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన లైబ్రరీ డే కార్యక్రమం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ. ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పుస్తకాల విలువను వివరించారు. రోజుకు ఒక మంచి పేజీ చదివినా అది జీవితంలో ఒక గొప్ప మార్పుకు నాంది అవుతుంది అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాలతో పాటు జీవిత చరిత్రలు, విజ్ఞాన గ్రంథాలు, శాస్త్ర సాంకేతిక పుస్తకాలు చదవడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, జ్ఞానం, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని తెలి పారు.మొబైల్ ఫోన్లలో సమయాన్ని వృథాచేయకుండా లైబ్రరీల్లో గడిపితేనే భవిష్యత్తు వెలుగులతో నిండిపోతుందని ఆయన సూచించారు. ఈరోజు పుస్తకం చదివే విద్యార్థే రేపటి సమాజానికి మార్గదర్శి అవుతాడు అని ప్రేరణాత్మకంగా మాట్లా డారు.కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు కూడా పుస్తక పఠనం తమలో కొత్త ఆలోచనలను పెంచుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు లైబ్రరీ వినియోగంపై ప్రత్యేక అవగాహన కల్పించగా, విద్యార్థుల్లో చదువుపై మరింత ఆసక్తి పెరిగింది.ఈ కార్యక్రమంలో గండిపేట్ మండల విద్యాధికారి నిరంజన్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, మాజీ కౌన్సిలర్ రామకృష్ణ రెడ్డి, శ్రీరాములు, యాలాల నరేష్, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, శ్రవణ్ కుమార్, సావిత్రి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

# సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తి మీడియాకు ఉంది

## విద్యార్థులు విద్యతోపాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలి : ప్రిన్సిపాల్ డా. సి.హెచ్. ప్రసాద్

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** నిజాన్ని నిష్పక్షపాతంగా వెలికితీస్తూ, సమాజానికి సరైన దిశానిర్దేశం చేయడంలో పాత్రికేయుల పాత్ర అపారమైనదని పేర్కొన్న బడంగ్పేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం. బడంగ్పేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంస్కృతి ప్రెస్ ఎంగేజ్‌మెంట్' కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. హెచ్. ప్రసాద్ అధ్యక్షతన అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యారంగం మరియు సామాజిక అంశాల పట్ల మీడియా చూపుతున్న చొరవను కొనియాడుతూ పలువురు విలేఖరులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మరియు ఉపన్యాసకులు మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కేవలం విద్య మాత్రమే కాకుండా సంస్కృతి, సామాజిక అవగాహన మరియు నైతిక విలువలు ఎంతో అవసరమని నొక్కి చెప్పారు.




కళాశాలలో చేపడుతున్న విద్యా, సాంస్కృతిక మరియు సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియా వారధిలా పనిచేస్తోందని ఆయన ప్రశంసించారు. ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభను సమాజానికి పరిచయం చేయడంలో ప్రెస్ మిత్రుల సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డా. రాజ్‌కుమార్ మరియు ఐక్యుఏసి కోఆర్డినేటర్ డా. రామరాజు సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తి మీడియాకు ఉందని, విద్యాసంస్థల పురోగతిలో పత్రికల పాత్ర కీలకమని తెలిపారు. ఎన్.ఎస్.ఎస్ సమన్వయకర్త డా. వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు కళాశాల నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, వీటికి మీడియా ద్వారా మంచి గుర్తింపు లభిస్తోందని అన్నారు. డా. ఎన్. జ్యోతి (ఎన్ఎస్ఎస్ మరియు కెరీర్ గైడెన్స్ సెల్) మాట్లాడుతూ 'సంస్కృతి' కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో మన సంప్రదాయాలు, నైతిక విలువలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు.నర్సింహారాజ్ (స్పోర్ట్స్ కోఆర్డినేటర్) మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఫిజిక్స్ విభాగం ప్రతినిధులు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని వివరించారు. ఈ వేడుకలో కామర్స్ విభాగం నుండి నర్సింహా, ఇంగ్లీష్ విభాగం నుండి డా. రేవతి, సురేందర్, ఇతర అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర యక్షగానం

### గ్రామీణ కళల పరిరక్షణ సేవ సమితి 11 వ వార్షికోత్సవం...

### ప్రాచీన కళలను ఆదరించాలి..

### మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్



**చౌటుప్పల్, మే 15,క్రైమ్ మిర్రర్ :** కనుమరుగవుతున్న ప్రాచీన కళలను నేటితరం యువత తప్పక ఆదరించాలని చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు.గ్రామీణ కళల పరిరక్షణ సేవా సమితి 11 వ వార్షికోత్సవం, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల దేవాలయం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణ కేంద్రంలోని గ్రామ కచ్చేరి వద్ద సమితి తరపున బ్రహ్మంగారి చరిత్ర యక్షగానాన్ని చిట్టిప్రోలు వెంకటేశం పంతులు, ఎరుకల భాస్కర్ గౌడ్, తారమతి పంతులు కళాబృందంతో కార్యక్రమంను కనుల పండుగగా ప్రదర్శించారు. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర యక్షగానం ప్రేక్షకులను అబ్బురపరిచే విధంగా రాత్రి 8 గంటల నుండి తెల్లవారి ఉదయం ఏడు గంటల వరకు నిరంతరాయంగా ప్రేక్షకులను మంత్రముగ్ధులు చేస్తూ కళాకారులు యక్షగాన భాగవత కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ప్రాచీన కళల పట్ల సమితి చేస్తున్న కృషి నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. ప్రాచీన కళలను ఆదరించడం, సంరక్షించడం మన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడంలో అత్యంత ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు. ప్రాచీన కళలు, జానపద కళారూపాలు, శిల్పకళ, సాహిత్యం మన పూర్వీకుల జీవన విధానాన్ని, విలువలను ప్రతిబింబిస్తాయని మాజీ కౌన్సిలర్ పోలోజు శ్రీధర్ బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు ఎరుకల మల్లేశం గౌడ్, పోలోజు శ్రీధర్ బాబు, దొడ్డి రాములు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంధాలయాన్ని సద్వినియోగం చేసుకోండి

### సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి.. ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి



**సంస్థాన్ నారాయణపురం, మే 15(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో ప్రజా పాలన– ప్రగతి ప్రాణాలిక లో భాగంగా గ్రంధాలయ దినోత్సవం సందర్భంగా పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి విచ్చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంధాలయాభివృద్ధికి ప్రభుత్వ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. రానున్న రోజుల్లో డిజిటల్ లైబ్రరీగా తీర్చిదిద్దడానికి తమ వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సురపల్లి వెంకటేష్ నేత , పందుల యాదగిరి గౌడ్, కట్ల వనజ భాస్కరాచారి, నీల అనిత శంకర్ ముదిరాజ్, సింగపంగా ప్రశాంతి రమేష్, మహమ్మద్ అలీమా యూసఫ్ ఖాన్, గ్రంథాలయ పాలకురాలు గంగాపురం ఉదయశ్రీ, క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్, రిపోర్టర్ గంగాపురం సాయి గౌడ్, సింగం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కమిషన్ వైస్ చైర్ పర్సన్ శశికళ యాదవ రెడ్డి కి ఘన సన్మానం



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 15:** పటాన్‌చెరు నియోజకవర్గంలో తెలంగాణ మహిళా కమిషన్ వైస్ చైర్మన్‌గా నియమితులైన శశి ?కళ యాదవ రెడ్డికి ఆమె నివాసంలో కైతలాపురం రాములు మర్యాదపూర్వకంగా కలిసి బోకే, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కైతలాపురం రాములు మాట్లాడుతూ.. శశికళ యాదవ రెడ్డి మాజీ అమీన్‌పూర్ సర్పంచ్‌గా రెండు సార్లు ప్రజలకు సేవలందించారని తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం అధ్యక్షురాలిగా కొనసాగుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండి పని చేశారని కొనియాడారు. "ఎప్పుడైనా పిలిచినా నేను ఉన్నానంటూ ప్రజలతో మమేకమై, వారి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టే నాయకురాలు శశికళ యాదవ రెడ్డి అని అన్నారు. అలాంటి నాయకురాలిపై నమ్మకం ఉంచి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా కమిషన్ వైస్ చైర్మన్ బాధ్యతలు అప్పగించడం అభినందనీయం" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అనూష, నర్సింగ్ గౌడ్, పటాన్‌చెరు అసెంబ్లీ స్వేరో నెట్‌వర్క్ ఇంచార్జ్ కైతలాపురం రాములు తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూతో అప్రమత్తంగా ఉండాలి

## సమిష్టి కృషితోనే కీటక జనిత వ్యాధుల నివారణ: కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మే 15 (క్రైమ్ మిర్రర్) :** జిల్లాలో డెంగ్యూ వ్యాధి నివారణకు అధికారులు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని కుమార్ దీపక్ అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో డెంగ్యూ నివారణపై గోడప్రతులు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమయ్యే సమయంలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్‌గునియా, జికా వంటి వ్యాధులు దోమల ద్వారా వ్యాపిస్తాయని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత కూడా తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డెంగ్యూ జ్వరంలో తీవ్ర జ్వరం, ఎముకలు, కండరాలు, కీళ్ల నొప్పులు, కళ్ల నొప్పి, శరీరంపై దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాపిడ్ డయాగ్నొస్టిక్ కిట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రాలు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎలిసా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి వారం 'డ్రైడే' పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. మురుగు కాలువల్లో చెత్తాచెదారం తొలగించేందుకు గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సంబంధిత శాఖలతో సమన్వయంగా పనిచేసి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎస్. అనిత, రాజస్వ మండల అధికారి శ్రీనివాస్‌రావు, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్, మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## మైలార్‌దేవ్‌పల్లిలో శ్మశాన వాటిక స్థల పరిశీలనఎమ్మెల్యే ఆదేశాలతో రంగంలోకి దిగిన మున్సిపల్ అధికారులు

### సమస్యలను వివరించిన కాంగ్రెస్ శ్రేణులు

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** స్థానిక శాసనసభ్యుల ఆదేశాల మేరకు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని శ్మశాన వాటిక (గ్రేవ్ యార్డ్) అభివృద్ధికి మున్సిపల్ అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు ముమ్మర చర్యలు చేపట్టారు. శుక్రవారం డివిజన్ కాంగ్రెస్ నాయకులు అధికారులతో కలిసి శ్మశాన వాటిక స్థలాన్ని, మైలార్ దేవరపల్లి ఉడెంగడ్డలో లో గల శ్మశానవాటికను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా శ్మశాన వాటికలో ప్రజలు ఎదుర్కొం టున్న పలు సమస్యలను నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శ్మశాన వాటిక ఆవరణలో తక్షణమే స్నానాల గదుల నిర్మాణం చేపట్టాలని, నీటి వసతి కోసం నూతనంగా బోరు వెయ్యాలని కోరారు. అలాగే పరిసరాల క్లీనింగ్, రాత్రి వేళల్లో ఇబ్బందులు కలగకుండా వీధి దీపాల (స్ట్రీట్ లైట్స్) ఏర్పాటు అత్యంత అవసరమని అధికారులకు వివరించారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను కోరగా, వారు సానుకూ లంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ధనంజయ, సీనియర్ నాయకులు టి. ప్రేమ్ గౌడ్, సం రెడ్డి ప్రతాపరెడ్డి, ఎన్ను శ్రీనివాస్ రెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, ఆంజనేయులు గౌడ్ మరియు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో శ్రీ సుదర్శన నరసింహ మహాయాగం

## నీలం మధు, కవిత దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 15:** ఇస్నాపూర్ మున్సిపాలిటీ చిట్కుల్‌లో నీలం మధు, కవిత దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వారి నివాసంలో నిర్వహించిన శ్రీ సుదర్శన నరసింహ హవన మహోత్సవం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం, ఆయురారోగ్య ఐశ్వర్య సిద్ధి కోసం చేపట్టిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం శుక్రవారం ఉదయం వేద పండితుల మంత్రోచ్చారణలతో ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారికి పంచామృతాలు, పవిత్ర జలాలతో అభిషేకం చేశారు. తదుపరి ప్రధాన కుంభారాధన అనంతరం శ్రీ సుదర్శన నరసింహ మహాయాగాన్ని వైభవంగా నిర్వహించారు. హోమగుండంలో హవిస్సులను సమర్పిస్తూ లోక శాంతి, ప్రజల సౌఖ్యసంతోషాల కోసం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వివాహ వార్షికోత్సవాన్ని ఆధ్యాత్మిక వేడుకగా నిర్వహించిన నీలం మధు, కవిత దంపతులను బంధుమిత్రులు, అతిథులు అభినందించారు.



# సహకార సంఘం ఎన్నికలు నిర్వహించాలి



**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలను నిర్వహించకుండా నామినేటెడ్ పాలక మండళ్లను నియమించడాన్ని వ్యతిరేకిస్తూ ఆర్టికల్ 243 జెడ్ హెచ్ ప్రకారం సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజ రామచంద్రం ఆధ్వర్యములో తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు... సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను,దుబ్బ వెంకన్న, కురుమర్తి ముత్తయ్య, పాల్గొన్నారు.

# మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ సమీక్ష సమావేశం

### తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి...

### యాదాద్రి జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు

**చౌటుప్పల్,మే 15,క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ మండల పరిధిలోని గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న త్రాగునీరు, ఎస్ లింగోటం 70 ఎంఎల్ డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ట్రాన్స్ఫార్మర్ యార్డ్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా ఈనెల 14 వ తేదీ గురువారం ఉదయం 5:00 గంటల నుండి నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులతో శుక్రవారం



చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు తమ గ్రామ పరిధిలో ఉన్న స్థానిక బోర్‌వెల్లులను గుర్తించి ప్రత్యామ్నాయ త్రాగునీటి సరఫరా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైన చోట్ల ట్యాంకర్ల ద్వారా కూడా నీటి సరఫరా చేపట్టాలని ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా పునరుద్ధరణ వరకు ప్రజలకు త్రాగునీటి కొరత తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని అధికారులు అడిషనల్ కలెక్టర్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వి శేఖర్ రెడ్డి, ఎంపీడీవో సందీప్ కుమార్, డివై, ఈఈ,ఏఈ ఈ, అధికారులు పాల్గొన్నారు.

# బాలానగర్ మెట్రో సమీపంలో గంజాయి రవాణా గుట్టురట్టు

## 907 గ్రాముల గంజాయి స్వాధీనం...యువకుడు అరెస్ట్


**కూకట్ పల్లి, మే 15 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి పోలీసుల అప్రమత్తతతో బాలానగర్ మెట్రో స్టేషన్ సమీపంలో గంజాయి అక్రమ రవాణా విక్రయానికి సంబంధించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నమ్మదగిన సమాచారంతో కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్.ఐ వి. తుకారాం ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో బాలానగర్ మెట్రో స్టేషన్ సమీపంలోని మెట్రో పిల్లర్ నెం. 863 వద్ద ఖాళీ ప్రదేశంలో అనుమానాస్పదంగా సంచరిస్తూ గంజాయి విక్రయానికి ప్రయత్నిస్తున్న మాదరబోయిన సాయి కుమార్ (24) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అతని వద్ద తనిఖీలు నిర్వహించగా సుమారు 907 గ్రాముల గంజాయి, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితుడు ఒడిశా రాష్ట్రానికి చెందిన పూర్ణచంద్ర అనే వ్యక్తి వద్ద నుంచి గంజాయిని తెచ్చుకొని, అధిక ధరలకు తనకు పరిచయం ఉన్న సాయి కృష్ణ, టక్కు అనే వ్యక్తులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కూకట్‌పల్లి పోలీసులు ఎన్ డి పీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి



నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. నగరంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు.

# సంగారెడ్డిలో పరిశ్రమల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి : జగ్గారెడ్డి

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 15:** సంగారెడ్డి నియోజకవర్గం కొండాపూర్ మండలం తొగర్‌పల్లి గ్రామంలో కేజేఎస్ పరిశ్రమ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు డి. శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహ, ఎంపీలు సురేష్ షెట్కార్, మాధవనేని రఘునందన్ రావు, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా



టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ... సంగారెడ్డి ప్రాంతంలో పరిశ్రమల స్థాపన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కేజేఎస్ పరిశ్రమ ద్వారా 1,600 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించనుండగా, అందులో 1,000 మంది మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. తొగర్‌పల్లి, అలియాబాద్, కొండాపూర్ ప్రాంతాలతో పాటు సంగారెడ్డి పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ పరిశ్రమ ఉపాధి కల్పించనుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహ సహకారంతో పరిశ్రమల స్థాపన వేగంగా జరుగుతోందన్నారు. ఇందిరాగాంధీ హయాంలోనే మెదక్ ప్రాంతంలో బీడీఎల్, ఓడీఎఫ్ వంటి పరిశ్రమలు స్థాపించబడ్డాయని గుర్తు చేసిన జగ్గారెడ్డి, రానున్న రోజుల్లో సంగారెడ్డి జిల్లాలో మరిన్ని పరిశ్రమలు తీసుకొచ్చి స్థానిక యువతకు ఉపాధి కల్పించే దిశగా కృషి కొనసాగిస్తామని తెలిపారు.

# ఎస్ఐఆర్ పేరుతో అక్రమంగా 40 వేల ఓట్లను తొలగించారు

### ఆధారాలతో సహా జోనల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశాం

### ఓట్లను తొలగిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు... ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి, మే 15 (క్రైమ్ మిర్రర్) :** ఎస్ఐఆర్ పేరుతో అక్రమంగా 40 వేల ఓట్లను తొలగించారని, క్షేత్రస్థాయిలో పరిశీలన లేకుండా ఓట్లను ఎలా తొలగిస్తారని కూకట్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులపై మండిపడ్డారు. శుక్రవారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ పేరుతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఓట్లను తొలగిస్తున్నారు అని, బూతు లెవెల్ స్థాయిలో తనిఖీలు చేపట్టి ఓట్ల పై నిర్ణయం తీసుకోవాల్సిన అధికారులు, క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండానే ఓట్లను తొలగిస్తున్నారు అని అన్నారు. ఇప్పటి వరకు ఫతే నగర్ డివిజన్ లో 351 నుండి 366 నంబర్ బూతులలోని గౌతం నగర్, మాధవి నగర్, నాగార్జున కాలనీ, శోభన కాలనీ, పైప్ లైన్ రోడ్ లలో ఓట్లను తొలగించారు అని వివరించారు. సుమారు 40 వేల ఓట్లను తొలగించారని చెప్పారు. ఇందుకు సంబంధించి ఆధారాలతో సహా జోనల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసామని, క్షేత్ర స్థాయి పరిశీలన లేకుండా ఓట్లను తొలగిస్తే చూస్తూ ఊరుకునేది లేదు అని హెచ్చరించారు. డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగానే కేటీఆర్ కు మూడు నెలల ముందు ఏసీబీ కోర్టు నోటీసులు, ప్రజా సమస్యలపై ప్రశ్నించే కేటీఆర్ ని తట్టుకోలేక నోటీసులు ఇచ్చారు అని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని భయభ్రాంతులకు గురిచేసిన కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావు భయపడరు అని అన్నారు. వారు ప్రజల తరఫున పోరాడుతారు, ప్రజా సమస్యలను వెలికి తీస్తారు అని అన్నారు. బడే బాయ్ చోటే బాయ్ ఒక్కటేనని మరోసారి తెలంగాణ ప్రజలకు అర్థమైంది అని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు రెండు పార్టీలకు గుణపాఠం చెప్తారు అనే భయంతోనే ఓట్లు తొలగిస్తున్నారు అని ఈ సందర్భంగా వివరించారు.



# నీట్ పరీక్ష రద్దు బీజేపీ పాలనలో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి

**ఎన్ టి ఏ వైఫల్యాలపై సమగ్ర విచారణ జరపాలి**

**పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**జేఎన్టీయూహెచ్ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర చైర్మన్, తెలంగాణ ఉద్యకారుడు ఎరవెల్లి జగన్**



**కూకట్ పల్లి, మే 15 (క్రైమ్ మిర్రర్) :** దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎంతో కష్టపడి సిద్ధమైన నీట్ 2026 పరీక్ష పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో రద్దు కావడం దేశ విద్యా వ్యవస్థపై ప్రజల్లో తీవ్ర అనుమానాలను కలిగిస్తోంది. ఒక నిమిషం ఆలస్యంగా వచ్చిన విద్యార్థిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించని అధికారులు, చెవిపోగులు, గడియారాలు, షూస్, బెల్టులు వంటి చిన్న చిన్న వస్తువులపై కఠిన నిబంధనలు అమలు చేసే వ్యవస్థ, అసలు ప్రశ్నాపత్రాలు ఎలా బయటకు వెళ్తున్నాయనే విషయంలో మాత్రం పూర్తిగా విఫలమైందని జేఎన్టీయూహెచ్ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర చైర్మన్, తెలంగాణ ఉద్యకారుడు ఎరవెల్లి జగన్ అన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎర్రవెల్లి జగన్ మాట్లాడుతూ విద్యార్థులను గంటల తరబడి తనిఖీ చేసే ప్రభుత్వ యంత్రాంగం, పేపర్ లీక్ మాఫియాను అడ్డుకోవడంలో ఎందుకు శ్రద్ధ పెట్టలేకపోయిందనే ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి. కోట్లాది మంది యువత భవిష్యత్తుతో ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం అత్యంత దారుణం. 2014 తర్వాత దేశంలో వరుసగా పేపర్ లీక్ ఘటనలు చోటుచేసుకోవడం బీజేపీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. నీట్, యు జి సి, ఎన్ ఇ టి, ఎస్ఎస్సి, రైల్వే, పోలీస్, టీచర్ ఎలిజిబిలిటీ పరీక్షలు ఇలా అనేక పరీక్షల్లో అవకతవకలు వెలుగుచూశాయి. వివిధ మీడియా నివేదికల ప్రకారం 2019 నుండి 2024 మధ్య దేశవ్యాప్తంగా కనీసం 65 ప్రధాన పరీక్షలు పేపర్ లీక్‌లతో ప్రభావితమయ్యాయి. నీట్ పరీక్షకు సంబంధించి కూడా 2016, 2021, 2024, ఇప్పుడు 2026లో మళ్లీ లీక్ ఆరోపణలు రావడం దేశ ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. 2024లో యు జి సి, ఎన్ ఈ టి పరీక్షను కూడా "పరీక్ష సమగ్రత దెబ్బతింది" అంటూ కేంద్ర ప్రభుత్వం స్వయంగా రద్దు చేయాల్సి వచ్చింది. అప్పట్లో లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పేపర్ లీక్‌లను అడ్డుకోలేని కేంద్ర ప్రభుత్వం, యువతకు ఉద్యోగాలు ఇవ్వడంలో విఫలమై ఇప్పుడు పరీక్షల నిర్వహణలో కూడా పూర్తిగా చేతులెత్తేసింది. ప్రతి సంవత్సరం విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలకు హాజరవుతుంటే, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వారి భవిష్యత్తు అనిశ్చితిలో పడుతోంది. పరీక్షలు లీక్ అవుతున్నాయి, పరీక్షలు రద్దవుతున్నాయి, విద్యార్థుల జీవితాలు నాశనం అవుతున్నాయని అన్నారు. పేపర్ లీక్ మాఫియా మాత్రం పెరుగుతోందని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆపాలిని అన్నారు. ఎన్ టి ఏ వైఫల్యాలపై సమగ్ర విచారణ జరిపి, పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. దేశ యువతకు న్యాయం చేయాలని జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నేత ఎరవెల్లి జగన్ డిమాండ్ చేసారు.



## పేదవాడిపై కేంద్ర ప్రభుత్వం కన్నెర్ర..పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై సీపీఎం ఆగ్రహం

**లీటరుకు రూ.3 పెంపుతో సామాన్యుడి నడ్డి విరుస్తున్నారు**

**కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న బీజేపీ సర్కార్**

**బాలానగర్, భరత్ నగర్‌లలో సీపీఎం ఆధ్వర్యంలో భారీ నిరసన**

**బాలానగర్, మే 15 (క్రైమ్ మిర్రర్) :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచుతూ పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తోందని సీపీఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పెరిగిన ఇంధన ధరలకు నిరసనగా శుక్రవారం బాలానగర్‌లోని సీపీఎం కార్యాలయం వద్ద, భరత్ నగర్‌లో పార్టీ శ్రేణులు ధర్నా చేపట్టాయి. ఈ సందర్భంగా ఐలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఇప్పటికే ఆకాశాన్ని తాకుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, ఇప్పుడు లీటరు పెట్రోల్, డీజిల్‌పై రూ. 3 పెంచడం వల్ల మరింత పెరిగి సామాన్యుడి జేబుకు చిల్లు పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసే వరకు ధరల పెంపు లేదని అబద్ధాలు చెప్పిన ప్రధాని, ఫలితాలు రాగానే దేశ పరిస్థితి సాకుతో ధరలు పెంచడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. యుద్ధాల పేరుతో సాకులు చెబుతూ, చమురు కంపెనీ దళారులకు లాభం చేకూర్చడమే ధ్యేయంగా కేంద్రం పనిచేస్తోందని, ప్రజల రక్తాన్ని తాగుతూ కార్పొరేట్ పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. దేశంలో ఏ విపత్తు వచ్చినా ప్రజలను దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని, కేంద్ర ప్రభుత్వం పన్ను రాయితీలు ఇచ్చి ఉంటే సామాన్యులకు ఉపశమనం లభించేదని ఆయన పేర్కొన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజి, కమల్, లక్ష్మి, రాజు, శ్రీను, ఇతర కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో నిరసన తెలిపారు.

## వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివింద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయం

**ప్రజలకు మజ్జిగ, పండ్లు, మంచినీరు పంపిణీ చేసిన ఎంసీఆర్ కాంప్లెక్స్ కమిటీ సభ్యులు**




**కూకట్ పల్లి, మే 15 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని సప్తగిరి కాలనీ రామాలయం దేవాలయం ముందు ఉన్న ఎంసీఆర్ కాంప్లెక్స్ వద్ద వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రజలను ఆకట్టుకుంది. ఎంసీఆర్ కాంప్లెక్స్ అధ్యక్షులు అభిలాష్ రెడ్డి, స్వాతి దంపతులు ఆధ్వర్యంలో ఈ చలివేంద్రంలో ప్రజలకు చల్లని మంచినీరు, మజ్జిగతో పాటు పండ్లను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి హాజరై చలివేంద్రం వద్దకు వచ్చిన ప్రజలకు స్వయంగా మజ్జిగ, పండ్లు, మంచినీరు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సేవా భావంతో ముందుకు వచ్చిన అభిలాష్ రెడ్డి -- స్వాతి దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి సంవత్సరం ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి. ప్రసాద్, లక్ష్మీనారాయణ, కొండా రెడ్డి, వైవి రావు, నర్సింగ్ రావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొని మజ్జిగ, పండ్ల పంపిణీలో చురుకుగా పాల్గొన్నారు. అలాగే ఎంసీఆర్ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, జయలక్ష్మి, స్వాతి, శివప్రసాద్, రవి రెడ్డి, సురేష్ బాబు, శ్రావణి తదితరులు సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి కమిటీ సభ్యుడిని పురేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. వేసవి వేళ ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా నిర్వహించిన ఈ చలివేంద్రం స్థానిక ప్రజల ప్రశంసలను అందుకుంది.

## కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి**

**కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



**కూకట్ పల్లి, మే 15 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు వేడెక్కుతున్న వేళ, శుక్రవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో కీలక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా ఒకే ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల ఓట్లను సైతం తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలపై ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా పక్కనపెట్టి ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ముందుకు వెళుతోందని, అలాంటి పరిస్థితులను ప్రజల్లో ఎండగట్టే బాధ్యత ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తపై ఉందని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేస్తూ ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుడు మాజీ కేసీఆర్ నాయకత్వం వైపు ప్రజలు మళ్లీ ఆశతో చూస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత రెండున్నర సంవత్సరాల్లో రాష్ట్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించిన ఆయన, ఇకనైనా ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ, "మేమున్నాం" అనే ధైర్యాన్ని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందించాలని ఆయన కోరారు. త్వరలోనే కూకట్‌పల్లి నియోజకవర్గ స్థాయిలో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సమావేశంలో కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, జూపల్లి సత్యనారాయణ, మందడి శ్రీనివాసరావు, సాభియా గౌసుద్దీన్, పగడాల బాబురావు, తూము శ్రావణ్ కుమార్, మహేశ్వరి శ్రీహరి తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివేకానంద నగర్‌లో సర్వీస్ రోడ్డు పనులకు వేగం

**ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆదేశాలతో రంగంలోకి అధికారులు**

**షాపు యజమానులు, వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో త్వరలోనే రోడ్డు పనుల పూర్తి**



**కూకట్ పల్లి, మే 15 (క్రైమ్ మిర్రర్) :** శేర్లింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్న ఎమ్మెల్యే, పి.ఎ.సి చైర్మన్ అరికెపూడి గాంధీ వివేకానంద నగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్డు సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపారు. ఈ నేపథ్యంలో వివేకానంద నగర్ మెయిన్ రోడ్డులోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నుంచి వివేకానంద చౌరస్తా వరకు మిగిలిపోయిన సర్వీస్ రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ, మున్సిపల్ అధికారులు, ఎలక్ట్రిసిటీ శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో కలిసి ప్రత్యక్షంగా పర్యటించారు. రోడ్డుపై అడ్డంకిగా ఉన్న విద్యుత్ పోల్స్, నేమ్ బోర్డులు, ముందుకు వచ్చిన షెడ్లు, పైపులను తొలగించి రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పిలుపుకు స్పందించిన స్థానిక షాపు యజమానులు తమ షాపుల ముందున్న బోర్డులు, పైపులు తొలగించి రోడ్డు పనులకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సౌకర్యార్థం చేపడుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమానికి తమ సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యమని, మిగిలిపోయిన సర్వీస్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుకు బాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిపిఎస్ మధు, ఎలక్ట్రిసిటీ ఏఈ చైతన్య, ట్రాఫిక్ సీఐతో పాటు వెల్ఫేర్ కమిటీ సభ్యులు జి. నర్సింగ్ రావు, లక్ష్మీనారాయణ, కిషోర్, జి. ప్రసాద్, వెంకటేశ్వరరావు, కె.వి.రావు, కొండారెడ్డి, డి. వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



## నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్రం పూర్తిగా విఫలం

**విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు**

**బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు పెరుమళ్ళ సతీష్**

**క్రైమ్ మిర్రర్,హుజూర్ నగర్(పాలకీడు) :** జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు పెరుమళ్ళ సతీష్ అన్నారు. శుక్రవారం పాలకీడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో కష్టపడి నీట్ పరీక్షను రాస్తే ఆ పరీక్ష పేపర్ లీక్ అవడం అనేది చాలా సిగ్గుచేటు అని మండిపడ్డారు. వేల మంది విద్యార్థులు వాళ్ళు ఉన్నతమైన లక్ష్యాలను పెట్టుకొని భవిష్యత్తు డాక్టర్లుగా రాణించాలని కఠోర శ్రమతోటి చదివి ఈ పేపర్ లీక్ తోటి వారి ఆశలు అడియాశలు అయినాయని వాపోయారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దరిదాపు 12 సంవత్సరాలు కావస్తున్న ఇంకా కూడా జాతీయస్థాయి పరీక్షల నిర్వహణలో విఫలమవుతుందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా పేపర్ లీక్ కారకులైన వారిని తక్షణమే అరెస్టు చేసి తొందరలో నీట్ పరీక్షలు మళ్లీ నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హరి నాయక్ ,వీరబాబు ,సుదర్శన్ నరేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 15 రోజుల్లో జీవన ప్రామాణీకరణ పూర్తి చేయాలి

**అధికారులకు అదనపు కలెక్టర్ చంద్రయ్య ఆదేశాలు**



**మంచిర్యాల, మే 15 (క్రైమ్ మిర్రర్):** చేయూత పథకం కింద బ్యాంకుల ద్వారా పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల జీవన ప్రామాణీకరణ ప్రక్రియను నిర్దిష్టంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాల పురపాలక సంఘాల పరిధిలో మొత్తం 27,854 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నట్లు తెలిపారు. వీరి జీవన ప్రామాణీకరణ ప్రక్రియను వచ్చే 15 రోజుల్లో పూర్తిచేయాలని సూచించారు. పింఛన్ దారులకు అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియలో భాగస్వాములు అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం జీవన ప్రామాణీకరణ విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, అదనపు డీఆర్‌డీఓ అంజయ్య, డీపీఎం అన్నాజీ, ఏపీఎం రాజ్‌కుమార్, పురపాలక సంఘ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అపర భగీరధుడు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి ఘన సత్కారం

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి విశేష కృషి చేసిన రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ని ఖమ్మం పౌరసమితి అధ్యక్షులు డాక్టర్ పులిపాటి ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం ఖమ్మం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది.తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ ప్రజా జీవితంలో ప్రవేశించి 44 సంవత్సరాలు పూర్తి చేసిన సందర్భంగా డాక్టర్ పులిపాటి ప్రసాద్ ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ పులిపాటి ప్రసాద్ తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధిని ధ్యేయంగా పెట్టుకుని ప్రజాసేవలో నిరంతరం ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. పలు ముఖ్యమంత్రుల ప్రభుత్వాల్లో మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ అనేక అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశారని తెలిపారు.జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు ఆసుపత్రుల నిర్మాణం ద్వారా విద్యా మరియు వైద్య రంగాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని గ్రామీణ ప్రాంతాల్లో ప్రాజెక్టులు లిఫ్ట్ ఇరిగేషన్లు కాలువల నిర్మాణం ద్వారా రైతులకు అండగా నిలిచారని అన్నారు. అలాగే గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో మంచినీటి



సౌకర్యం కల్పించి ప్రజల అవసరాలను తీర్చారని పేదలకు ఇళ్ల స్థలాలు పక్కా గృహాలు నిర్మించి వారికి గూడు కల్పించారని వివరించారు.రోడ్లు రహదారులు ప్రభుత్వ భవనాల నిర్మాణంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి పునాది వేశారని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి చరిత్రలో తుమ్మల కి ప్రత్యేక స్థానం ఉంటుందని కొనియాడారు. ఆయనను మచ్చలేని నాయకుడు అపర భగీరధుడుగా అభివర్ణించారు.ఈ కార్యక్రమంలో పౌరసమితి నాయకులు పట్నాయక్ వెంకటేశ్వరరావు మాధవరావు శ్రీనివాస్ రావు, సతీష్ ఖాజా వెంకటేశ్వరరావు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చివరగా తుమ్మల నాగేశ్వరరావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవిస్తూ సమాజానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.



## వేగవంతంగా ధాన్యం సేకరణ

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమిస్తూ, ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నూతనకల్ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ప్రధానంగా ఎదురవుతున్న లారీల కొరత, హమాలీల ఇబ్బందులు మరియు అన్‌లోడింగ్ సమస్యలను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు లారీల కొరత లేకుండా రవాణా శాఖ మరియు పోలీస్ అధికారుల సమన్వయంతో అన్ని రకాల వాహనాలను ధాన్యం సేకరణకు మళ్లిస్తున్నామన్నారు. రైస్ మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ఆలస్యం కాకుండా ఉండేందుకు ప్రతి మిల్లుకు ఒక ప్రత్యేక ఇన్‌ఛార్జ్‌ను నియమించామనీ తెలిపారు. ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసి అన్ లోడింగ్ వేగవంతం చేస్తున్నామని చెప్పారు. మండల స్థాయిలో కొనుగోళ్ల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు మండల ప్రొక్యూర్మెంట్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రెవెన్యూ, సివిల్ సప్లై మరియు పోలీస్ శాఖలు సమన్వయం చేసుకుంటూ ధాన్యం సేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక కోఆర్డినేటర్లు క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారని పేర్కొన్నారు. అకాల వర్షాల దృష్ట్యా అలర్ట్ మెకానిజం సిద్ధం చేశామని కలెక్టర్ వెల్లడించారు. ఒకవేళ అకాల వర్షాల వల్ల ధాన్యం తడిస్తే, రైతులు ఆందోళన చెందవద్దని అటువంటి ధాన్యాన్ని వెంటనే గుర్తించి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.ఈనాటి కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసరావు,ఎంపివో తదితరులు పాల్గొన్నారు .

## అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ను కట్టెల లారీని పట్టుకున్న పోలీసులు





**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక ట్రాక్టర్ అలాగే కట్టెల లారీని పోలీసులు పట్టుకొని స్టేషన్కు తరలించారు.టిఎస్34టిబి1228 ట్రాలీ నెంబర్ టిఎస్34టిబి1229 దండు వెంకటేష్ బొమ్మిరెడ్డిపల్లి కలప లారీ నెంబర్ ఏపి16వి0955 కొర్ర సుమన్ ఇబ్రహీంపట్నం గార్లపై కేసు నమోదు చేసినట్లు కుల్కచర్ల ఎస్సై వి రమేష్ కుమార్ తెలిపారు.

## వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు శిక్షణ

### పాల్గొన్న వ్యవసాయ జిల్లా అధికారి రాజరత్నం పి ఎస్ సి ఎస్ చైర్మన్ మార్కెట్ కమిటీ చైర్మన్

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై ఒకరోజు రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాజరత్నం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కనకం మొగులయ్య కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు పాల్గొని రైతులకు దిశా నిర్దేశం చేశారు. 99 రోజుల ప్రజా పాలన ప్రణాళికలో భాగంగా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బొలుసని భీమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పి గోపాల్ నాయక్, కుల్కచర్ల గ్రామ సర్పంచ్ వారువాళ్ళ అంజిలయ్య, సర్పంచులు రైతులు తదితరులు పాల్గొన్నారు.







## ప్రజా పాలన ప్రజా గ్రంథాలయ వారోత్సవాలు

**క్రైమ్ మిర్రర్ వలిగొండ:**రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలోని ప్రజావాణి కార్యక్రమంలోని భాగంగా వలిగొండ శాఖ గ్రంథాలయంలో భాగంగాగ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ఘనంగానిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విశ్రాంతి బంధారపు లింగస్వామి ఉపాధ్యాయులు సభ అధ్యక్షులుగా ప్రముఖ కవి రెబ్బ మల్లికార్జున్, పద్మ అవార్డు గ్రహీతపారుపల్లి నరసింహ పాల్గొన్నారు.ముఖ్య అతిథులు మాట్లాడుతూ గ్రంధాలయాలు నేటి ఆధునిక,దేవా లయాలని,వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని,పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు గ్రంథాలయాని సందర్శించి తమ లక్ష్యాన్ని చేరుకోవచ్చునని తెలిపారు.శాఖా గ్రంథాలయాన్ని అందరికీ అందుబాటులో తీసుకొని వచ్చి, మౌలిక వసతులు కల్పించి,గ్రంథాలని ఆధునికరించాలని కోరారు.గ్రంథాలయ నిర్వాహకులు పిట్టల ఆంజనేయులు ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ఎమ్మే మధు కిరణ్,మచ్చ సాయి తేజ, ముత్యాల స్వామి, పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆదరణ పొందిన వైద్య శిబిరం

### స్వతంత్ర మైక్రో హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ

**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మే 15:** స్వతంత్ర మైక్రో హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడాలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సంస్థ శాఖ మేనేజర్ దేవేందర్ దేవరకొండ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచనలు అందించారు.శిబిరంలో వైద్య నిపుణుడు డాక్టర్ ఎండి రఫీ పాల్గొని రోగులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, రామకృష్ణ, నరేందర్, అక్రమ్, రాజు, రామ్, వంశీ, మాతృ, అంజి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు. వైద్య బృందం మేనేజర్ గంగారం, అచ్యుత్, రాఘవ, పవన్, వెన్నెల సేవలందించారు.స్థానిక ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.




# మానవత్వం చాటిన గ్రామస్తులు

**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్) :** బతుకు దెరువు కోసం వచ్చిన వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ తుది శ్వాస విడిచారు.చేతిలో చిల్లి గవ్వ లేదు నిలువ నీడ లేదు. సొంత గ్రామానికి పార్థివ దేహాన్ని తరలించడానికి చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. గ్రామస్తులు దయార్థ హృదయంతో బంధువుల వలే అంతా కలిసి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటారు.వివరాలలోకి వెళ్తే నూతనకల్‌లో పానీపూరి నడుపుతూ జీవిస్తున్న ఉత్తరప్రదేశ్ కి చెందిన సోను అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. పదేళ్లుగా అక్కడే ఉంటున్న అతడి కుటుంబ పరిస్థితిని చూసి గ్రామస్థులు చలించిపోయారు.గ్రామానికి చెందిన ఇమ్మారెడ్డి రాజబహదూర్ రెడ్డి అంత్యక్రియలకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. గ్రామస్థులే బంధువులై అంతిమయాత్ర నిర్వహించి, మానవత్వాన్ని చాటుకున్నారు. పరాయి రాష్ట్రం నుంచి వచ్చిన వ్యక్తికి అండగా నిలిచిన గ్రామస్థులను పలువురు అభినందిస్తున్నారు.



## మున్సిపాలిటీలో అవినీతి సహించం

### గత పాలకవర్గం పనులతో తమకు సంబంధం లేదన్న చైర్మన్, వైస్ చైర్మన్

**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మే 15: :** మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలు తమ హయాంలో జరిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ స్పష్టం చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.తాము



అధికారంలోకి వచ్చి నాలుగు నెలలే అవుతుండగా, ఇటీవల వెలుగులోకి వచ్చిన అక్రమాలు, ఏసీబీ దాడుల్లో బయటపడిన అంశాలు గత ప్రభుత్వ కాలం, గత మున్సిపల్ పాలకవర్గం సమయంలో జరిగినవేనని తెలిపారు. ప్రస్తుతం వస్తున్న అవినీతి ఆరోపణలతో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు.ఇటీవల వరుసగా వస్తున్న కథనాల కారణంగా ప్రజల్లో అపోహలు నెలకొన్నాయని, వాటిని నివృత్తి చేయడం తమ బాధ్యతగా భావించి వాస్తవాలను వెల్లడిస్తున్నామని పేర్కొన్నారు. కొన్ని అభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వ నిధులతో జరుగుతున్నాయని, వాటి పర్యవేక్షణ నేరుగా ఉన్నతస్థాయిలో జరుగుతోందని చెప్పారు.డంపింగ్ యార్డు కార్యకలాపాలను మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ సీసీ కెమెరాల ద్వారా నేరుగా పర్యవేక్షిస్తున్నారని, అక్కడ ఎలాంటి అవకతవకలకు అవకాశం లేదన్నారు. ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మవద్దని, పారదర్శక పాలనతో మిర్యాలగూడ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామని తెలిపారు.భవిష్యత్తులో పట్టణ అభివృద్ధికి అనేక ప్రణాళికలు సిద్ధం చేశామని, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చైర్మన్, వైస్ చైర్మన్ పేర్కొన్నారు.

## జవహర్ నగర్ దోపిడీ కేసులో పురోగతి

### ప్రధాన నిందితులను పట్టుకున్న పోలీసులు

హైదరాబాద్,మే15: జవహర్‌నగర్ నేపాలీ ముఠా దోపిడీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న మమత అలియాస్ మీనా కడాయత్, ఆమె భర్త రమేశ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేపాల్ సరిహద్దుల్లో ఈ దంపతులు అరెస్ట్ అయ్యారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో నలుగురి కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. చోరీ జరిగిన రోజు యజమాని ద్విచక్ర వాహనాన్ని తీసుకుని దుండగులు పరారయ్యారు. ఆ బైక్‌ను యాప్రాల్లోని పెట్రోల్ బంకు వద్ద వదిలి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ఏజెంట్ భీమ్‌ను పోలీసులు విచారిస్తున్నారు. ప్రధాన నిందితులను రేపటిలోగా హైదరాబాద్‌కు తరలించనున్నట్లు సమాచారం. అలాగే ఈ కేసులో మిగిలిన నిందితులు నేపాల్‌లో తలదాచుకున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కౌకూరు గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీధర్ మోహన్ దంపతులను బంధించి.. నేపాలీ ముఠా దోపీడీకి పాల్పడిన విషయం తెలిసిందే. దాదాపు 75 తులాల బంగారం, 20 కిలోల వెండితో దుండగులు పరారయ్యారు. ఈ దోపిడీపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.


Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.